




epaper. aksharakalam. com

# అక్షరకలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 156 | 29-08-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00


# ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి



### అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం

### ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదన్న జూపల్లి

### ప్రజల దరఖాస్తులకు వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలని ఆదేశం

### అధికారులు పాత పనితీరును మార్చుకోవాలని హెచ్చరిక

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదని... వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా దరఖాస్తు పంపినా అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నర ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉంటారని, అందుకే పేరు, చిరునామా, ఫోన్ నంబర్‌తో కూడిన రాతపూర్వక ఫిర్యాదును వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపవచ్చని వెల్లడించారు.

అధికారులు ఆ దరఖాస్తులను ప్రింట్ తీసుకుని వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కారం చూపాలని, ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు మూడ్రోజుల్లోనే జారీ చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అధికారులు తమ పాత పనితీరును మార్చుకోవాలని, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జూపల్లి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.





భారత్ - అమెరికా రక్షణ

## రంగంలో మరో ముందడుగు

భారత్ - అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఖీమీ) ప్రక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్ (ఌూ)పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

2




సోనియా గాంధీ ఆత్మకథను

## మేము ప్రచురించడం లేదు: పెంగ్విన్ ఇండియా

సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'ను తాము ప్రచురించడం లేదని ప్రముఖ ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తాజాగా పేర్కొంది. పుస్తకంలో ఎడిటోరియల్ మార్పులకు కాంగ్రెస్ నేత అంగీకరించలేదన్న వార్తల నేపథ్యంలో పెంగ్విన్ ఇండియా ఈ ప్రకటన విడుదల చేసింది. 'ఆ పుస్తకానికి మేము పబ్లిషర్ కాదు. పుస్తకంలో మార్పులకు సోనియా సిద్ధంగా లేకపోవడంతోనే మేము వెనక్కు తగ్గామన్న వార్తల్లో నిజం లేదు' అని కూడా పెంగ్విన్ ఇండియా స్పష్టం చేసింది. అయితే, ఈ పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఉత్సుకతతోనే ఉన్నామని కూడా సంస్థ పేర్కొంది. రచయితలు పేర్కొన్న వివరాల వెనకున్న వాస్తవాలను పరిశీలించి సూచనలు చేయడం తమ బాధ్యతని పెంగ్విన్ ఇండియా పేర్కొనడం గమనార్హం.

2



అసెంబ్లీ చరిత్రలో మొదటిసారి..

## సీఎం సీటు వదిలి మంత్రుల మధ్య కూర్చున్న సీఎం విజయ్..

తమిళనాడు అసెంబ్లీలో అత్యంత అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఎంతో కాలంగా వస్తున్న సంప్రదాయా నికి ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వీడ్కోలు పలికారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం సీటును వదిలి మంత్రులో కలిసి కూర్చున్నారు. తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి కోసం ఓ విశాలమైన, ప్రత్యేక సీటు కేటాయించారు.

## 2036 ఒలింపిక్స్‌పై ఫోకస్..

### భారత్‌ను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే మోడీ సర్కార్ లక్ష్యం: అమిత్ షా



## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..



తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే.

వార్త 2లో



## ఆ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై మంత్రి దామోదర్ సీరియస్

**జహీరాబాద్,**

జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరుపై తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వారిపై విచారణకు మంత్రి ఆదేశించారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని హుకుం జారీ చేశారు. ఈ మేరకు జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్‌తో చికిత్సపై మీడియాలో వచ్చిన కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్ చొంగ్తుతో మంత్రి దామోదర్ మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ హుకుం జారీ చేశారు.

# 2036 ఒలింపిక్స్‌పై ఫోకస్..

## భారత్‌ను గ్లోబల్ స్పోర్ట్స్ హబ్‌గా మార్చడమే మోడీ సర్కార్ లక్ష్యం: అమిత్ షా



**న్యూఢిల్లీ: అక్షరకలం ప్రతినిధి**

భారత్‌ను ప్రపంచ క్రీడల రాజధానిగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అహ్మదాబాద్ వేదికగా అంతర్జాతీయ క్రీడోత్సవాల ఏర్పాట్లపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష్ సంఘవి పాల్గొన్న ఈ మీటింగ్‌లో 2030 కామన్‌వెల్త్ గేమ్స్ ఏర్పాట్లతో పాటు 2036 ఒలింపిక్స్ ఆతిథ్య బిడ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. కార్యనిర్వాహకప్రభుత్వ సేవలను తెలుసుకోవడంగతంలో 2010లో ఢిల్లీ వేదికగా చివరిసారిగా కామన్‌వెల్త్ గేమ్స్ జరిగాయి. సరిగ్గా 20 ఏళ్ల విరామం తర్వాత 2030లో ఈ మెగా ఈవెంట్ మళ్లీ ఇండియాకు, అదీ అహ్మదాబాద్ నగరానికి రాబోతోంది. కామన్‌వెల్త్ గేమ్స్ ప్రారంభమై వందేళ్లు పూర్తవుతున్న శుభసందర్భంలో జరిగే ఈ వందో ఎడిషన్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యం ఇవ్వడం విశేషం. ఈ ఈవెంట్‌కు సంబంధించిన భద్రత, రవాణా బాధ్యతలను కేంద్ర హోంశాఖ దగ్గరుండి పర్యవేక్షించనుంది.

**2036 ఒలింపిక్స్ బిడ్.. అసలు నిర్ణయం ఎప్పుడంటే:**

వరల్డ్ బిగ్గెస్ట్ స్పోర్ట్స్ ఈవెంట్ అయిన 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం అహ్మదాబాద్ గట్టిగా పోటీ పడుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (×ూజ)తో కంటిన్యూయస్ డయలాగ్ దశలో ఉన్నామని, దీనిపై తుది నిర్ణయం 2029 నాటికి వెలువడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. గుజరాత్ డిప్యూటీ సీఎం హర్ష్ సంఘవి ఐఓసీ ప్రతినిధులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు.

**2029లోనే బిగ్ ట్రైలర్.. వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్:**

కామన్‌వెల్త్, ఒలింపిక్స్ క్రీడల కంటే ముందే అహ్మదాబాద్ నగరం 2029లో వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ కు ఆతిథ్యం ఇవ్వనుంది. దాదాపు 70 దేశాల నుంచి 10,000 మందికి పైగా అథ్లెట్లు పాల్గొనే ఈ టోర్నీ, అహ్మదాబాద్ వేదికగా జరగనున్న తొలి అంతర్జాతీయ మల్టీ-స్పోర్ట్ ఈవెంట్ కానుంది. ఈ ఈవెంట్స్ ద్వారా నిర్మించే స్టేడియంలు, ఇతర మౌలిక వసతులు 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

# యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదు

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జబల్పూర్ (మధ్యప్రదేశ్): అక్షరకలం ప్రతినిధి**

యుద్ధ రంగంలో డ్రోన్లు, క్షిపణుల పాత్ర ఎంత పెరుగుతున్నప్పటికీ, యుద్ధ ట్యాంకుల ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. సరిహద్దుల్లో శత్రువుకు ఇవి "ఉక్కు గోడ"లా నిలిచి, సైనికుల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని కొనియాడారు. గురువారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న 57 ఏండ్ల చరిత్ర కలిగిన వెహికల్ ఫ్యాక్టరీ జబల్‌పూర్ (వీఎఫ్ జే)లో రూ.472 కోట్ల వ్యయంతో నిర్మించనున్న టీ-సిరీస్ యుద్ధ ట్యాంకుల ఓవర్‌హాల్ కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. మన సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన బలగాల్లో ఒకటిగా ఉందని, టీ-72, టీ-90 యుద్ధ ట్యాంకులు గ్రౌండ్ వార్‌ఫేర్‌కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ నూతన కేంద్రం ద్వారా ఏటా 80 టీ-72, టీ-90 ట్యాంకులను ఓవర్‌హాల్ చేయనున్నట్లు తెలిపారు. భారత సైన్యానికి ఏటా సుమారు 230 ట్యాంకుల పునరుద్ధరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.



# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..

రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ

రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ

రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య



**. హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.



# భారత్ - అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు

**ఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి**

భారత్ - అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ (ఖీమీ) ప్రక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్ (ూూ)పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు.భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ ఫర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక 'ఫైర్ అండ్ ఫర్గెట్' టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల ట్యాంకులు, బంకర్లు, సాయుధ వాహనాలను ధ్వంసం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు.

# సోనియా గాంధీ ఆత్మకథను మేము ప్రచురించడం లేదు: పెంగ్విన్ ఇండియా

**ఇంటర్నెట్ డెస్క్: అక్షరకలం ప్రతినిధి**

సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'ను తాము ప్రచురించడం లేదని ప్రముఖ ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా తాజాగా పేర్కొంది. పుస్తకంలో ఎడిటోరియల్ మార్పులకు కాంగ్రెస్ నేత అంగీకరించలేదన్న వార్తల నేపథ్యంలో పెంగ్విన్ ఇండియా ఈ ప్రకటన విడుదల చేసింది. 'ఆ పుస్తకానికి మేము పబ్లిషర్ కాదు. పుస్తకంలో మార్పులకు సోనియా సిద్ధంగా లేకపోవడంతోనే మేము వెనక్కు తగ్గామన్న వార్తల్లో నిజం లేదు' అని కూడా పెంగ్విన్ ఇండియా స్పష్టం చేసింది. అయితే, ఈ పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఉత్సుకతతోనే ఉన్నామని కూడా సంస్థ పేర్కొంది.రచయితలు పేర్కొన్న వివరాల వెనకున్న వాస్తవాలను పరిశీలించి సూచనలు చేయడం తమ బాధ్యతని పెంగ్విన్ ఇండియా పేర్కొనడం గమనార్హం. ఇలాంటి సూచనలు, పరిశీలనలు తమ ప్రచురణ ప్రక్రియలో సర్వసాధారణమని కూడా సంస్థ తెలిపింది. చర్చల సందర్భంగా తాము పుస్తక ప్రచురణపై ఆసక్తితోనే ఉన్నట్టు కూడా చెప్పింది. రచయితలతో జరిపిన చర్చలను గోప్యంగా ఉంచుతామని, ఈ విషయంలో అంతకుమించి చెప్పేందుకు ఏమీ లేదని పెంగ్విన్ ఇండియా తేల్చి చెప్పింది.

# అసెంబ్లీ చరిత్రలో మొదటిసారి.. సీఎం సీటు వదిలి మంత్రుల మధ్య కూర్చున్న సీఎం విజయ్..

**ఇంటర్‌నెట్ డెస్క్:**

తమిళనాడు అసెంబ్లీలో అత్యంత అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఎంతో కాలంగా వస్తున్న సంప్రదాయానికి ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వీడ్కోలు పలికారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సీఎం సీటును వదిలి మంత్రులలో కలిసి కూర్చున్నారు. తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి కోసం ఓ విశాలమైన, ప్రత్యేక సీటు కేటాయించారు. ఆ సీటు స్పీకర్‌కు చాలా దగ్గరగా ఉంటుంది. సీఎం సీటు పక్కన.. ముందు వరుసలో మంత్రుల కోసం విశాలమైన సీట్లు కేటాయించారు. సీనియారిటీ ఉన్న మంత్రులు మొదటి వరుసలోని సీట్లలో కూర్చుంటారు.బుధవారం మధ్యాహ్నం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి విజయ్ తన సీటును వదిలి పక్కకు వచ్చేశారు. మంత్రులు కేఏ సెంగోట్టియాన్, అధవ్ అర్జున మధ్యలోకి వెళ్లి కూర్చున్నారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా మంత్రులకు కేటాయించిన సీట్లలో కూర్చోలేదని తెలుస్తోంది. సాధారణంగా తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు తోటి మంత్రులతో మాట్లాడటానికి తమ సీట్లు మారుతుంటారు. సంభాషణ పూర్తయిన తర్వాత తమ స్థానంలోకి వచ్చి కూర్చుంటారు. కానీ, ఓ ముఖ్యమంత్రి తన అధికారిక సీటును వదిలి మంత్రులతో కూర్చోవటం ఇదే మొదటిసారి.

# వెలిగొండ నిర్వాసితులకు గుడ్‌న్యూస్..

## కటాఫ్ డేట్ దాటినా యువతకు రూ.2 లక్షల సాయం

**మార్కాపురం,**

వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి కూటమి ప్రజా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. కటాఫ్ డేట్ ముగిసినా అర్హులైన 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్థిక సాయం అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. రూ.169 కోట్లను ఆర్థిక సాయంగా అందించనున్నారు. గెజిట్ సహా, సోషియో ఎకనామిక్ సర్వేలో నమోదు కాని, అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అవార్డు పాస్ కాని యువతకు కూడా ఆర్థిక సాయం అందేలా చూడాలని సూచనలు చేశారు.ఆధునిక దేవాలయాలైన ప్రాజెక్టుల వద్ద భూములు, ఆస్తులు కోల్పోయిన వారందరికీ సాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో మొత్తం 1800 గ్రీవెన్సులు, పిటిషన్లను పరిశీలించి వారికి న్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2019 కటాఫ్ డేట్ నుంచి 2026 వరకూ 18 ఏళ్లు నిండిన యువతకు కూడా రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనుంది. నిర్వాసితులకు చెల్లించిన పరిహారానికి అదనంగా రూ.169 కోట్ల సాయంగా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవార్డులో లేని నిర్వాసితుల్ని గుర్తించి వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 7027 మంది నిర్వాసిత కుటుంబాలకు రూ.905 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని సర్కార్ అందించిన విషయం తెలిసిందే. 2019 కటాఫ్ డేట్ తర్వాత 18 ఏళ్ల నిండిన వారికి ఆర్థిక సాయం అందించేలా సీఎం చంద్రబాబు మానవతా దృక్పథంతో వ్యవహరించారు. నిర్వాసితులకు నెల రోజులకు సరిపడా రేషన్ కిట్‌ను కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు.

### ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం: మంత్రి నిమ్మల

ఏ ప్రాజెక్టులోనూ ఇవ్వనంత భరోసా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇవ్వాలని సీఎం ఆదేశించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మార్కాపురం కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. అర్హుల జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి 1800 గ్రీవెన్సులు వచ్చాయని, వాటిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. నేటి నుంచే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆర్థికసాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు ఇవ్వటంతో పాటు చివరి నిర్వాసితుడికి న్యాయం



చేసేంత వరకూ ప్రక్రియ కొనసాగిస్తామని అన్నారు.నిర్వాసితులకు ఎక్కడా అన్యాయం జరిగిందన్న మాట లేకుండా చూస్తామని మంత్రి వెల్లడించారు. నిర్వాసిత కాలనీల్లోనూ మౌలిక సదుపాయాలను పూర్తి చేసి వారికి న్యాయం చేస్తామన్నారు. గత పాలకులు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కాకుండానే డ్రామాలు ఆడారని విమర్శించారు. సూపర్ ఎల్ నినో పరిస్థితుల్లోనూ సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టి డెల్టాలో పంటలకు నీరిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# మై భారత్ రంగారెడ్డి ఆధ్వర్యంలో అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్, ఎల్‌బీ నగర్‌లో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" కార్యక్రమం

అక్షరకలం రంగారెడ్డి

రంగారెడ్డి, 27 ఆగస్టు 2026: జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా మై భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రిన్సిపాల్ డా. నీతూ సచ్‌దేవా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మై భారత్ అధికారి శ్రీ యాదగిరి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారిణి కుమారి శ్రావ్య శివాని చిలకలపూడి విద్యార్థులతో ముచ్చటించి, క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీ జి. సుధాకర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, దేశంలో బలమైన క్రీడా వ్యవస్థను నిర్మించడం, యువత తమ జీవితంలో క్రీడలు మరియు ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలను ప్రధానమంత్రి సందేశం ప్రధానంగా ఉద్ఘాటించింది. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, మానసిక స్థైర్యం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందిస్తాయని కార్యక్రమంలో వివరించారు. యువత శక్తిని సానుకూల దిశలో మళ్లించి వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనలో భాగస్వాములను చేయడంలో క్రీడల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, స్వచ్ఛంద సేవ, అనుభవాధారిత అభ్యాసం, నాయకత్వం మరియు సామాజిక సేవకు సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో ఉత్సాహంగా పాల్గొని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి తమ ఆలోచనలు, అభిప్రాయాలతో సహకరించాలని కోరారు. మై భారత్, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, మై భారత్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనకు అర్థవంతమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.









## నేడే శివాని ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కళాకారులకు, "శివాని" ప్రతిభా పురస్కారాలు :

**శివాని ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బాపనపల్లి పరమేశ్వర్:**

హైదరాబాద్ కరస్పాండెంట్, ( అక్షర కలం : ఆగస్టు 28 )



శివాని ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ నాడు చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో కళాకారులకు" శివాని ఆర్ట్స్" ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు శివాని ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ వ్యవస్థాపక అధ్యక్షులు బాపనపల్లి పరమేశ్వర్ మీడియాతో పేర్కొన్నారు. పురస్కారాల కంటే ముందు మధ్యాహ్నం 1: గంట నుండి 3: గంటల వరకు గౌతమ్ మోడల్ స్కూల్ జనగామ వారి సమర్పణలో "సంగీత విభావరి" ఉంటుందని, మధ్యాహ్నం 3 నుండి 6 గంటల వరకు శ్రీకృష్ణ రాయబారం పూర్తి నాటక ప్రదర్శన, అదేవిధంగా సాయంత్రం 6:30 నిమిషాల నుండి శ్రీ వెంకటేశ్వర కళాపరిషత్ జనగామ వారి సౌజన్యంతో సత్య హరిశ్చంద్రీయం స్మశాన ఘట్టం ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయని పరమేశ్వర్ పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుండి సభా కార్యక్రమం నిర్వహిస్తూ ముఖ్య అతిథులతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో "శివాని ప్రతిభా" పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

## ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం -- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

అక్షర కలం :రంగారెడ్డి

రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం--పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పేద కుటుంబాలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో పట్టణ పేదల కోసం ప్రత్యేకంగా లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని, తొలి దశ పైలట్ ప్రాజెక్టుగా నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 480 ఇళ్ల చొప్పున నిర్మాణానికి టెండర్లు ఖరారయ్యాయని చెప్పారు. త్వరలో మరో నాలుగు నియోజకవర్గాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని మంత్రి తెలిపారు. భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ సుమారు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని, ఇందులో భూమి విలువ సుమారు రూ.50--60 లక్షలు, నిర్మాణ వ్యయం సుమారు రూ.10--15 లక్షలు ఉంటుందని వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేద కుటుంబాలకు ఎటువంటి ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తోందన్నారు. లబ్ధిదారుల కుటుంబంలోని మహిళ పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇతర ఛార్జీలను కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. గతంలో పేదలకు ఇళు కేటాయించే సమయంలో వారి నివాస ప్రాంతాలకు 30--40 కిలో మీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించి ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. దీనివల్ల ఉపాధి, పిల్లల చదువులు, స్థానిక సామాజిక సంబంధాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే లేదా సమీప ప్రాంతంలోనే ఇళ్లను నిర్మించి అందించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. రిజర్వేషన్ నిబంధనలను పాటిస్తూ బహిరంగ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేపడుతున్నామని చెప్పారు. లక్కీ డ్రాలో పేరు వచ్చినంత మాత్రాన తుది కేటాయింపు జరిగినట్లు కాదని స్పష్టం చేశారు. అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి భౌతికంగా పరిశీలించి, పత్రాలు మరియు అర్హతలను ధ్రువీకరించిన అనంతరం తుది ఎంపిక, కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

మొదటి విడత లక్కీ డ్రాలో ఇల్లు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని మంత్రి అన్నారు. భవిష్యత్‌లో మరింత ప్రభుత్వ భూమిని సమీకరించి ఇళ్ల నిర్మాణాన్ని విస్తరించినప్పుడు మిగిలిన అర్హులైన దరఖాస్తుదారులను తదుపరి విడతల్లో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఒకసారి లక్కీ డ్రాలో పేరు రాకపోయిందని దరఖాస్తు ముగిసిపోయినట్లు కాదని, అర్హులైన వారికి తదుపరి దశల్లో కూడా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ఒక సంవత్సరంలోపు ఇళ్లను సిద్ధం చేసి లబ్ధిదారులకు తాళాలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఇల్లు ఇచ్చే కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబానికి శాశ్వత చిరునామా, భద్రమైన భవిష్యత్తు, పిల్లలకు మెరుగైన జీవితం, మహిళలకు ఆస్తిపై హక్కును కల్పించే కార్యక్రమమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో "పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అనే నిబద్ధతతో ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, పేద ప్రజలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సంతోషకరమైన విషయమన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గానికి కేటాయించిన 480 ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. ఈ ఇళ్ల కోసం మొత్తం 1,881 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేస్తూ లక్కీ డ్రా ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు రాని అర్హులైన దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, వెయిటింగ్ లిస్ట్ నిర్వహించి, భవిష్యత్ దశల్లో మరిన్ని ఇళ్లు మంజూరైనప్పుడు వారికి కూడా అవకాశం కల్పిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు హౌసింగ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని ఎండీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) డాక్టర్ కె.కిరణ్మయి, రాజేందర్ నగర్ ఆర్డీఓ శ్రీధర్, పిడి హౌసింగ్ చంప్లా నాయక్, సంబంధిత అధికారులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.







## జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం: విచారణ కు ఆదేశం.

**బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలకు ఆదేశం.**

**హెల్త్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ లతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.**

హైదరాబాద్ కరస్పాండెంట్, ( అక్షర కలం : ఆగస్ట్ 28,)



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ గైర్హాజరు, ప్రైవేట్ డాక్టర్ తో చికిత్స పై వివిధ పత్రికలలో వచ్చిన వార్త కథనాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా క్రిస్టినా జెడ్ చొంగ్తు గారితో మాట్లాడారు. కు ఆదేశించారు. ఈ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో ప్రైవేట్ డాక్టర్ ఉండటం, డాక్టర్ల గైర్హాజరు పై మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 (బి ఎన్ ఎస్ ఎస్) అమలు

**పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు, పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ .. పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

ఆగస్టు 30 వ తేదిన ఖమ్మం కమిషనరేట్ పరిధిలో నిర్వహించే చీజుజు (గ్రా+) నీట్ పీజీ –2026 పరీక్షల సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు సెక్షన్ 163 దీచీూ (బిఎన్ఎస్ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నార.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# మంచుకొండల్లో మహా విలయం

**నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది.**

హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జల ప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4



తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంతయ్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగ్ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగ్ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌తో పేదల సొంతింటి కల సాకారం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లక్ష్మీగూడలోని లక్ష్మీ భవనం--పొదుపు సంఘం హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. పేదలకు శాశ్వతమైన, నాణ్యమైన ఇళ్లను ఉచితంగా అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 4.50 లక్షల ఇళ్లు, రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. హైదరాబాద్ నగర పేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా, పైలట్ ప్రాజెక్టు కింద తొలి విడతలో నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కో చోట 480 ఇళ్లకు టెండర్లు ఖరారయ్యాయని, త్వరలోనే మరో నాలుగు నియోజకవర్గాలకు విస్తరిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ టవర్స్‌లో నిర్మించే ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుందని, భూమి విలువతో కలిపి ఒక్కో ఇంటి విలువ రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంటుందని మంత్రి వివరించారు. ఇంత విలువైన ఇంటిని పేదలకు రూపాయి ఖర్చు లేకుండా అందిస్తూ, కుటుంబంలోని మహిళ పేరిటే రిజిస్ట్రేషన్ చేయిస్తామని, ఆ రిజిస్ట్రేషన్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా నివాస ప్రాంతాలకు దూరంగా కాకుండా, లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గం లేదా సమీప ప్రాంతాల్లోనే ఇళ్లను నిర్మించి ఇవ్వడం ద్వారా వారి ఉపాధికి, పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా చూస్తున్నామని తెలిపారు. లక్కీ డ్రాలో పేరు వచ్చిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతలను పరిశీలించాకే తుది కేటాయింపులు జరుగుతాయని, మొదటి విడతలో ఇళ్లు రాని అర్హులు నిరాశ చెందకుండా తదుపరి విడతల్లో వారికి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఏడాది కాలంలోనే నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, లక్కీ డ్రా ద్వారా పూర్తి పారదర్శకంగా ఎంపిక చేపట్టడం అభినందనీయ మన్నారు. హౌసింగ్ బోర్డు ఎండీ పి.వి. గౌతమ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 480 ఇళ్లకు 1,881 దరఖాస్తులు రాగా, ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం లక్కీ డ్రా నిర్వహించామని తెలిపారు. మిగిలిన అర్హుల జాబితాను వెయిటింగ్ లిస్ట్‌లో ఉంచి భవిష్యత్ కేటాయింపుల్లో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, రాజేంద్రనగర్ ఆర్డీవో శ్రీధర్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంప్లా నాయక్, ఇతర అధికారులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా 'ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్': క్రీడలను జీవనశైలిగా మార్చు కోవాలని:శ్రావ్య శివాని




జాతీయ క్రీడా దినోత్సవం--2026ను పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'మై భారత్' రంగారెడ్డి విభాగం ఆధ్వర్యంలో ఎల్‌బీ నగర్‌లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందించిన వర్చువల్ సందేశాన్ని వీక్షించారు. క్షేత్రస్థాయిలో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, దేశంలో పటిష్టమైన క్రీడా వ్యవస్థను నిర్మించడం మరియు యువత నిత్య జీవితంలో ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వడంపై ప్రధాని తన సందేశంలో ప్రత్యేకంగా ఉద్ఘాటించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని, యువశక్తిని సానుకూల దిశలో నడిపించి 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో భాగస్వాములను చేయడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని సభలో వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతూ సచ్‌దేవా, ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మై భారత్ అధికారి యాదగిరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రముఖ జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి శ్రావ్య శివాని చిలకలపూడి మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నిరంతర సాధన అత్యంత ఆవశ్యకమని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. సుధాకర్ సమన్వయం చేశారు. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని సామాజిక సేవ, నాయకత్వ శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027'లో ఉత్సాహంగా పాల్గొనాలని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ కోరారు. యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుంటూ అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.

## రాజకీయ విభేదాల వేళ సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన కొండా సురేఖ

):



తెలంగాణ కాంగ్రెస్‌లో గత కొద్దిరోజులుగా నెలకొన్న ఉత్కంఠ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల కలయిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిఫార్సు చేసిన ఘటనలు పార్టీ వర్గాల్లో కలకలం రేపాయి. ఈ విభేదాల వార్తల నడుమ రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ నేరుగా సీఎం నివాసానికి వెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఆయన అల్లుడు, మనవడికి కూడా కొండా సురేఖ ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పవిత్రమైన పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయబోనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినేనని, సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్రంలోని మహిళల అండ, ఆడబిడ్డల ఆశీర్వాదాలు ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించే సంపూర్ణ శక్తిని, ఆయురారోగ్యాలను సీఎంకు ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. కూతురి విమర్శలు, పార్టీ క్రమశిక్షణా కమిటీ నోటీసుల తదనంతర పరిణామాల మధ్య మంత్రి కొండా సురేఖ స్వయంగా సీఎం నివాసానికి వెళ్లి రాఖీ కట్టడం, సానుకూల వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా సరికొత్త సయోధ్యకు సంకేతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంతో గత కొద్ది రోజులుగా సాగుతున్న వివాదాలకు తెరపడి నట్లయిందని పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా 'ఇందిరమ్మ టవర్స్': మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే 'ఇందిరమ్మ టవర్స్' ఫ్లాట్ల కేటాయింపును అత్యంత పారదర్శకంగా చేపడుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతిరోజూ నాలుగు నియోజకవర్గాల చొప్పున మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని సుమారు 8 వేల ఫ్లాట్లకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, మీడియా సమక్షంలో పారదర్శకంగా నిర్వహిస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన లక్కీడ్రా కార్యక్రమాల్లో మంత్రి స్వయంగా పాల్గొని లబ్ధిదారులతోనే డ్రా తీయించారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు గాను 600 మందిని లక్కీడ్రా ద్వారా ప్రాథమికంగా ఎంపిక చేస్తున్నామని, క్షేత్రస్థాయి పరిశీలనలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని మంత్రి వివరించారు. లబ్ధిదారులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయిస్తుందని, సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 17 నుంచి 20 గజాల అవిభాజ్య భూమి వాటాతో లిఫ్ట్ సదుపాయం కలిగిన 10 అంతస్తుల వరకు ఆధునిక భవనాలను నిర్మించి ఇస్తామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ పత్రాలను అత్యవసర సమయాల్లో బ్యాంకుల్లో కుదువబెట్టి రుణాలు పొందే వెసులుబాటు ఉంటుందని, పదేళ్ల తర్వాత ఇంటిని విక్రయించుకోవచ్చని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన కొద్దిరోజుల్లోనే టెండర్లు, డ్రా ప్రక్రియ పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని, తుది పరిశీలన పూర్తయిన మూడు నాలుగు రోజుల్లోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ఈ కేటాయింపుల్లో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని, మొత్తంగా మహిళలకు 30 శాతం కోటా కేటాయించామని మంత్రి తెలిపారు. వందల కోట్ల విలువైన నగర ప్రాంతాల్లోనూ పేదలు గౌరవంగా జీవించాలన్నదే ప్రభుత్వ ఆశయమని పేర్కొన్నారు. నగర పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత కింద మంజూరైన 4.50 లక్షల ఇళ్లలో ఇప్పటికే 2 లక్షలకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికను మరో పది రోజుల్లో పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి వివరించారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట



# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్?లో రెండు ఇన్నింగ్స్?ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్?గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్?లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లూ పడిక్కల్?పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్?కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్?గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్?డౌన్?లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్?లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్?లో బ్యాటింగ్? చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్?మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్?నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్?కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్?లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్?తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్?మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్?లో వరుసగా రెండు మ్యాచ్?ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్?పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్?ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్?కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్?లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్?ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్?డౌన్?లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్?లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు. అందుకే పడిక్కల్ అలా కాకుండా పరిస్థితులకు తగ్గట్లు ఆడుతూ ఫామ్?ను కాపాడుకోవాల్సి ఉంటుంది.

# కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరే

## స్పష్టం చేసిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్

టీమిండియా రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరేనని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. అబద్ధం చెప్పి అతన్ని పక్కన పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌కు కుల్దీప్ యాదవ్ దూరమైన సంగతి తెలిసిందే.వైరల్ ఫీవర్‌తోనే కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడని ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. 'కుల్దీప్ యాదవ్ తన వైరల్ ఫీవర్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు అతను దూరమయ్యాడు. అవసరమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా కుల్దీప్ బరిలోకి దిగగలడు.'అని తెలిపింది.అయితే ఈ ప్రకటనను మెజార్టీ అభిమానులు విశ్వసించలేదు. వైరల్ ఫీవర్ పేరిట కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించారని ఆరోపించారు. తొలి టెస్ట్‌లో కుల్దీప్ యాదవ్ ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీయడంతో అతన్ని తప్పిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. 33 ఏళ్ల సారాన్ష్ జైన్‌కు అవకాశం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే వైరల్ ఫీవర్ అంటూ బీసీసీఐ చేసిన ప్రకటనపై నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సితాన్ష్ కోటక్‌ను మీడియా ప్రతినిధులు ఈ విషయంపై ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేం ప్రశ్న? ఇలా ఎలా ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది ఏ మాత్రం సందర్భోచితమైన ప్రశ్న కాదు. కుల్దీప్ యాదవ్‌కు గాలే నుంచి వచ్చేటప్పుడే వైరల్ ఫీవర్ సోకింది. జట్టుకు ఆఫ్-స్పిన్నర్ అవసరమైతే.. కుల్దీప్ యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అతను ఆడే స్థితిలో లేనప్పుడు ఒకవేళ ఫిట్‌గా ఉంటే ఏం చేసేవారని అడగడం సరికాదు. ఇలా ఆలోచించడం కూడా అన్యాయం'అని సితాన్ష్ కోటక్ ఘాటుగా బదులిచ్చాడు. రిషభ్ పంత్ గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీరియస్ ఇంజ్యూరీ కాదని సితాన్ష్ కోటక్ తెలిపాడు. అతను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని చెప్పాడు. మైదానంలో యశస్వి జైస్వాల్, అసితా ఫెర్నాండో గొడవపై స్పందిస్తూ.. ఆటలో ఇవన్నీ సహజమని అభిప్రాయపడ్డాడు. బౌలర్ ఏదో అన్నాడని, కానీ యశస్వి జైస్వాల్ అలా దూసుకెళ్తాడని తాను అనుకోలేదని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ గైర్హాజరీతో 33 ఏళ్ల సరాన్ష్ జైన్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) మరో శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. రవీంద్ర జడేజా(43), యశస్వి జైస్వాల్(45) తృటిలో హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. క్రీజులో ధ్రువ్ జురెల్(7 బ్యాటింగ్)తో పాటు సరాన్ష్ జైన్(4 బ్యాటింగ్) ఉన్నాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా.. లాహిరు కుమార, కేశర నువాంత తలో వికెట్ తీసారు.






అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సినిమా

CINEMA






# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు.

# నటనను నీ నుంచి నేర్చుకోవాల్సిందే

'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది. చిన్నారి నటనకు ధనుష్ లాంటి స్టార్ నుంచి ప్రశంసలు రావడంపై అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఇరుముడిలో నక్షత్ర నటన నిజంగానే అద్భుతం , ధనుష్ ప్రశంసలు ఆమెకు మరింత ప్రోత్సాహం ఇస్తాయి అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో బేబీ నక్షత్ర పాత్ర కథలో కీలకంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు.



# తెలుగులో విడుదలవుతున్న 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది. యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టిపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.




# శివాలయంలో సామూహిక గాయత్రీ ధారణ మహోత్సవం



**చిట్యాల, ఆగస్టు 28 (అక్షర కలం)**

రాఖీ పౌర్ణమి సందర్భంగా చిట్యాల పట్టణంలోని శివాలయంలో భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక గాయత్రీ ధారణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ శాస్త్రోక్తంగా గాయత్రీ పూజ నిర్వహించి, యజ్ఞోపవీతం విశిష్టతను వివరించారు. పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గోత్రనామాలతో అర్చనలు చేయించుకుని యజ్ఞోపవీతాలను ధరించారు. అనంతరం రాఖీలు కట్టుకుని, మిఠాయిలు మరియు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జెల్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, పున్న పాండుజీ, జెల్ల సత్తయ్య, గంజి సుధాకర్, చేపూరి శ్రీనివాస్, వలకీర్తి రమేష్, రాపోలు లక్ష్మయ్య, గంజి కృష్ణయ్య, చెరుపల్లి శ్రీనివాస్, గంజి గోవర్ధన్, కస్తూరి కృష్ణమోహన్, తడక మురళి, గంజి కనకయ్య, డా. కోట దయాకర్, మిర్యాల గోపాల్, వడ్డేపల్లి రాములు, గంజి అంజయ్య, సూరపల్లి సత్యనారాయణ, కైరం కొండ భాస్కర్, మిర్యాల వెంకటేశం, గుర్రం బిక్షపతి, మిర్యాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరదల్లో పెద్దకాపర్తి మహిళ గల్లంతు

**చిట్యాల, ఆగస్టు 28 (అక్షర కలం)**



నేపాల్‌లో సంభవించిన భారీ వరదల్లో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన కందిమల్ల సుహాసిని రెడ్డి (42) గల్లంతైనట్లు సమాచారం. దీంతో ఆమె కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. సుహాసిని రెడ్డి తన భర్త నన్నూరి సంజీవరెడ్డి, ఇద్దరు కుమారులతో కలిసి కొంతకాలంగా ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్నారు. హైదరాబాద్‌లోని ఇంటి గృహప్రవేశ కార్యక్రమం కోసం ఈ నెల 19న కుటుంబంతో కలిసి భారత్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ఈ నెల 23న విహారయాత్ర నిమిత్తం నేపాల్‌కు వెళ్లారు. అయితే నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు సంభవించడంతో సుహాసిని రెడ్డి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆమె కోసం సంబంధిత అధికారులు, కుటుంబ సభ్యులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

# అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్

**అక్షరకలం దేవరకొండ**

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శుక్రవారం పరామర్శించారు. హైదరాబాద్ హస్తినాపురంలోని ఆరుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవరకొండ మండలం చింతబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నోముల రవీందర్‌ను ఎమ్మెల్యే పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిండి మండలానికి చెందిన యువ కార్యకర్తను కూడా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి, బాధితులిద్దరికీ మెరుగైన వైద్యం అందించాలని, త్వరగా కోలుకునేలా చూడాలని సూచించారు. కార్యకర్తలు త్వరితగతిన కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు అల్లప్పుడూ అండగా ఉంటామని, వారి క్షేమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



## 30న తుంగతుర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం

**తుంగతుర్తి ఆగస్టు 28 (అక్షర కలం):**

అక్షర ఫౌండేషన్ -- సూర్యాపేట, శంకర కంటి ఆస్పత్రి -- హైదరాబాద్ ఆధ్వర్యంలో, స్వర్గీయ సంకినేని కమలమ్మ -- రామారావు జ్ఞాపకార్థం, ఎస్.కె.ఆర్. కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను సంకినేని రవీందర్ రావు, తుంగతుర్తి గ్రామ సర్పంచ్ సాయిబాబా విడుదల చేశారు. ఈ సందర్భంగా సంకినేని రవీందర్ రావు మాట్లాడుతూ...తుంగతుర్తి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు కంటి వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శంకర కంటి ఆస్పత్రి, హైదరాబాద్ వైద్య నిపుణులచే శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించబడతాయని చెప్పారు. కంటి సమస్యలు ఉన్నవారిని పరీక్షించి, ఆపరేషన్ అవసరమైన అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపించబడునని తెలిపారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరం 30వ తేదీన అనగాఆదివారం ఉదయం 9:00 గంటలకు, తుంగతుర్తి రామాలయం గుడి దగ్గర ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల భవన్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. తుంగతుర్తి గ్రామంతో పాటు, పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో శిబిరానికి హాజరై ఉచిత కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారు ఉచిత ఆపరేషన్ సేవలను పొందాలని సంకినేని రవీందర్ రావు కోరారు.



# నాథుడే లేని వైద్యాశ్రమం !

## నల్గొండ జిజిహెచ్ లో పర్యవేక్షణ లోపంతో నవజాత శిశువు బలి
## సూపరింటెండెంట్ సెలవు, ఇన్చార్జుల వివాదాలతో స్తంభించిన పాలన.!
## ఒకరి తర్వాత ఒకరుగా బలైపోతున్న రోగులు
## ఆసుపత్రి పాలనను గాడిలో పెట్టాలని కలెక్టర్‌కు ప్రజా విన్నపం

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేద, మధ్యతరగతి ప్రజలకు కొండంత అండగా నిలవాల్సిన వైద్య దేవాలయం. కానీ నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ( జిజిహెచ్) మాత్రం రోగుల ప్రాణాలతో చెలగాటమాడే 'నిర్లక్ష్య నిలయం'గా మారిపోయింది. తీవ్రమైన పాలనా సంక్షోభం, అధికారుల బాధ్యతారాహిత్యం, పర్యవేక్షణ లోపం కలగలిసి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. (శుక్రవారం) పండుగ వేళ పండంటి బిడ్డ ఇంటికి వస్తాడని ఆశపడిన ఆ తల్లిదండ్రులకు చివరికి తీవ్ర విషాదమే మిగిలింది. వైద్యుల నిర్లక్ష్యం వల్ల నవజాత శిశువు మృతి చెందడం, దానికి బాధ్యత వహించాల్సిన పాలకులు ముఖం చాటేయడం ఇక్కడి అధ్వాన పరిస్థితికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

**పండుగ వేళ ఆ కుటుంబంలో తీరని శోకం..**

నల్లగొండ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన కంభంపాటి కవిత (25) ప్రసవం కోసం స్థానిక ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చేరారు. బుధవారం వరకు తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని, సాధారణ ప్రసవం (నార్మల్ డెలివరీ) అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అయితే గురువారం ఉదయానికి ఒక్కసారిగా కథ మారింది. బిడ్డ గుండె స్పందనలు పడిపోతున్నాయని చెబుతూ అత్యవసరంగా శస్త్రచికిత్స (సిజేరియన్) చేయాలని సూచించారు. ఆపరేషన్ నిర్వహించిన కొద్దిసేపటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. "నిన్నటి వరకు క్షేమంగా ఉన్న బిడ్డ.. ఒక్క రాత్రిలోనే ఎలా









చనిపోతాడు?" అంటూ వారు ఆసుపత్రి ఎదుట కన్నీరుమున్నీరుగా విలపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డను కోల్పోయామని ఆరోపిస్తూ శుక్రవారం ఉదయం ఆసుపత్రి ఎదుట బంధువులతో కలసి ధర్నాకు దిగారు. దీంతో ఆసుపత్రి ఆవరణలో కొంతసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**అడ్మినిస్ట్రేషన్ లోపమే మరణాలకు కారణమా.?**

ఈ ఘోర కలికి కేవలం వైద్యుల పొరపాటే కాకుండా, ఆసుపత్రిలో నెలకొన్న తీవ్రమైన అడ్మినిస్ట్రేషన్ లోపమే ప్రధాన కారణమని స్వయంగా ఆసుపత్రి సిబ్బందే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి పక్కా పాలన, పర్యవేక్షణ లేకపోవడం వల్లే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**సెలవు లో సూపరింటెండెంట్..**

గత జూలై మొదటి వారంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అధికారి, వచ్చిన కొద్ది రోజులకే ఏకంగా 28 రోజుల పాటు సుదీర్ఘంగా సెలవుపై వెళ్లడం ఇక్కడి పాలనా అలసత్వానికి నిదర్శనం.

**ఇన్ఛార్జి వివాదాలు -- స్తంభించిన పాలన..**

సూపరింటెండెంట్ సెలవులో వెళ్లడంతో ఇంచార్జి బాధ్యతలను మరొకరికి అప్పగించారు. అయితే ఆయన తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ ఈనెల 25న నర్సింగ్ ఆఫీసర్లు ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు.

**నాథుడే లేని ఆసుపత్రి...**

ఈ గొడవపై స్పందించిన డీఎంఈ.. సూర్యాపేట జిల్లా సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లతో ఎంక్వయిరీ కమిటీని వేసింది. 26న విచారణకు వచ్చిన కమిటీ ఎదుట "నేను డ్యూటీ చేయలేను" అని ఇన్ఛార్జి సూపరింటెండెంట్ తెగేసి చెప్పినట్లు సమాచారం. ఆ రోజు నుండి ఇప్పటివరకు ఆసుపత్రికి సూపరింటెండెంట్ అనే వారే లేకుండా పోయారు.

**పర్యవేక్షణ లోపంతో వరుస ఘోరాలు..**

ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస పర్యవేక్షణ లేకపోవడంతో వరుసగా దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈనెల 12న ఆసుపత్రి ఆవరణలోనే 'మమత' అనే బాలింత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్లే ఆ ఘోరం జరిగిందని అప్పట్లో బాధిత కుటుంబం ఆరోపించింది. ఇప్పుడు మళ్లీ అదే పర్యవేక్షణ లోపం వల్ల నవజాత శిశువు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

**సమగ్ర విచారణకు డిమాండ్.. కలెక్టర్ స్పందిస్తారా.?**

ఆసుపత్రిలో సరైన అధిపతి లేకపోవడంతో సిబ్బంది సమయపాలన పాటించకుండా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నారని జిల్లా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిశువు మృతిపై జిల్లా అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పాలనను గాడిలో పెట్టాలని, ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ పోస్టును భర్తీ చేసి, ప్రసూతి విభాగాల్లో తల్లులు, శిశువులు, రోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని నల్గొండ జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

**ఆప్యాయతలు పంచుకున్న సోదర సోదరీమణులు**

**పండుగ సందడితో కళకళలాడిన తుంగతుర్తి**

**తుంగతుర్తి, ఆగస్టు 28 (అక్షర కలం):**

అన్నాచెల్లెళ్ల అనురాగానికి, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు తుంగతుర్తి మండలంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ కావడంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా రాఖీ పౌర్ణమిని జరుపుకున్నారు. సోదరీమణులు తమ సోదరుల మణికట్టుకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. సోదరులు తమ సోదరీమణులకు కానుకలు అందించి ఆప్యాయతను చాటుకున్నారు.

**ప్రేమానుబంధాలకు ప్రతీకగా రాఖీ**

రాఖీ పౌర్ణమి అంటే కేవలం చేతికి రాఖీ కట్టే పండుగ మాత్రమే కాదు.. సోదరుడు, సోదరి మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, ఆప్యాయత, అనుబంధాలను గుర్తుచేసే పవిత్రమైన రోజు. జీవితంలో ఎన్ని మార్పులు వచ్చినా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సోదర సోదరీమణులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. సోదరీమణులు తమ సోదరులకు కుంకుమ బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, మిఠాయిలు తినిపించి రాఖీ కట్టారు. సోదరులు కూడా తమ సోదరీమణుల క్షేమాన్ని కోరుకుంటూ కానుకలు అందజేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న సోదర సోదరీమణులు సైతం ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**పల్లెల్లో పండుగ వాతావరణం**

తుంగతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా పండుగ వాతావరణం కనిపించింది. పట్టణాలు, గ్రామాల్లోని దుకాణాలు రంగురంగుల రాఖీలతో కళకళలాడాయి. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ బొమ్మలు, పూసలు, రంగురంగుల దారాలతో తయారు చేసిన రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగకు ఒకటి రెండు రోజుల ముందుగానే రాఖీల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా



మారాయి. ఉద్యోగాలు, చదువులు, వివాహాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న సోదర సోదరీమణులు రాఖీ పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో కుటుంబాల్లో సందడి నెలకొంది. చాలాకాలం తర్వాత కలుసుకున్న అన్నాచెల్లెళ్లు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

**రాఖీ వెనుక గొప్ప సందేశం**

రాఖీ అనేది సోదరుడికి సోదరి కట్టే పవిత్రమైన రక్షా సూత్రంగా భావిస్తారు. తన సోదరుడి జీవితంలో ఎల్లప్పుడూ సుఖసంతోషాలు ఉండాలని సోదరి కోరుకోవడం, సోదరుడు తన సోదరికి అండగా ఉంటాననే భరోసా ఇవ్వడం ఈ పండుగలోని అంతరార్థం. అందుకే రక్షాబంధన్‌ను కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పండుగగా భావిస్తారు.

తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

సాంకేతిక పరిజ్ఞానం పెరిగి జీవన విధానంలో అనేక మార్పులు వచ్చినా రాఖీ పౌర్ణమి సందర్భంగా పాటించే సంప్రదాయాలు మాత్రం నేటికీ కొనసాగుతున్నాయి. ఒకప్పుడు సోదరుడి ఇంటికి వెళ్లి రాఖీ కట్టిన సోదరీమణులు ప్రస్తుతం దూర ప్రాంతాల్లో ఉన్నా ప్రయాణించి లేదా ఇతర మార్గాల ద్వారా తమ ప్రేమను చాటుకుంటున్నారు. బంధాలు దూరమైనా మనసులు మాత్రం దగ్గరగానే ఉంటాయని రాఖీ పండుగ మరోసారి చాటిచెబుతోంది.

**శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక విశిష్టత**

హిందూ పంచాంగం ప్రకారం శ్రావణ శుక్ల పక్ష పౌర్ణమి సందర్భంగా రక్షాబంధన్‌ను నిర్వహిస్తారు. ఈ ఏడాది పౌర్ణమి తిథి ఆగస్టు 27 ఉదయం ప్రారంభమై ఆగస్టు 28 ఉదయం వరకు ఉండటంతో సూర్యోదయ తిథి ఆధారంగా ఆగస్టు 28న రాఖీ పౌర్ణమిని జరుపుకోవాలని పండితులు సూచించారు.

**బంధాలను కాపాడే పండుగ**

రాఖీ పౌర్ణమి మన కుటుంబ వ్యవస్థలోని అనుబంధాల విలువను గుర్తుచేసే పండుగ. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే ఆప్యాయత జీవితాంతం కొనసాగాలని కోరుకుంటూ జరుపుకునే ఈ పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపుతుంది. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, నమ్మకం అనే నాలుగు విలువలను మరింత బలపరిచే రాఖీ పౌర్ణమి వేడుకలు తుంగతుర్తి మండలంలో ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

# సెప్టెంబరు 2న హైదరాబాద్‌లో 'బంజారా అర్చకుల ఆత్మీయ సమ్మేళనం'

తెలంగాణ రాష్ట్రంలోని బంజారా ధూప దీప నైవేద్య పథకం పూజారులు, బావాజీలు, భగత్‌ల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వచ్చే నెల 2వ తేదీ (బుధవారం) హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'బంజారా అర్చకుల ఆత్మీయ సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు ధూప దీప నైవేద్య పథకం బంజారా అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేతవత్ జయరాం గురుస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర, జిల్లా నూతన కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవం కూడా జరగనుందని వెల్లడించారు. ప్రస్తుతం ఇస్తున్న రూ. 12,000 వేతనాన్ని రూ. 25,000కు పెంచాలని, అర్చకులందరికీ హెల్త్ కార్డులతో పాటు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే ప్రతి తండాలోని ఆలయ నిర్మాణానికి జ+ఖీ, ౹ు సబ్‌ప్లాన్ కింద రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని, పథకం వర్తించని వారికి తక్షణమే దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి నూతన నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి పోరఘడ్ పీఠాధిపతి శ్రీ బాబు సింగ్ మహారాజ్, బుడియబాపు పీఠాధిపతి శ్రీ భగవాన్ సాధ్‌లతో పాటు పలువురు పీఠాధిపతులు, రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. కావున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బావాజీలు, భగత్‌లు, సాధువులు, నాయక్, కార్బరీ, డావ్‌లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

## చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే

### బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది

### ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు



**న్యూఢిల్లీ,**

నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### ఆటోను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### ఏడుగురు మృతి...కొందరికి తీవ్ర గాయాలు

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు, మంత్రులు

### తోణ సహాయక చర్యలకు అధికారులకు ఆదేశాలు

**పల్నాడు,**

పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతులను బొంతా బాబు, బొంతా మణెమ్మ, సంపూర్ణమ్మ, లక్ష్మమ్మ, గంగమ్మ, మరియమ్మ, చౌటుపల్లి సువార్తగా గుర్తించారు. కాగా, బాధితులంతా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా పోలీసులు తెలిపారు. వీరంతా ప్రకాశం జిల్లా కొండమంజులూరులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలు, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. రోడ్డు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, సత్య కుమార్ స్పందించారు. రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం, పలువురు గాయపడటంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు పల్నాడు జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆటోను ఢీకొని ఏడుగురు మృతి చెందడం, పలువురు తీవ్రంగా గాయపడటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధికారులకు ఫోన్ చేసి ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతి చెందిన వారు చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామస్థులుగా అధికారులు వివరించారు. తీవ్రంగా గాయపడిన వారిని గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురి చేసింది. ఒకే ఊరికి చెందిన వారు పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తూ ప్రాణాలు కోల్పోవడం కలచివేసింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించాం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని లోకేశ్ పేర్కొన్నారు. చిలకలూరిపేట రోడ్డు ప్రమాదంపై హోంమంత్రి వంగలపూడి అనిత దిగ్భ్రాంరతి వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పల్నాడు జిల్లా అదనపు ఎస్పీకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, బస్సు వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం సహా అన్ని కోణాల్లో విచారణ చేయాలన్నారు.

# మత్స్యకారులు అందరూ సురక్షితం

**అమరావతి,**

కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ కోల్పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా బయటపడ్డారు. అల్లవరం మండలం నుండి చేపల వేటుకు వెళ్లిన బోటులోని సిబ్బంది అందరూ పశ్చిమ బెంగాల్ లో సురక్షితంగా ఉన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారందరినీ వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. పడవతో పాటు ఆచూకీ కోల్పోయిన ఏడుగురిలో అంతా సురక్షితంగా ఉండడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరం శ్రమించిన గాలింపు బృందాలకు, అధికార యంత్రాంగానికి ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులతో సముద్రంలోకి వెళ్లిన బోటు సాకేంతిక లోపంతో పనిచేయక, గాలులకు వేరే ప్రాంతానికి కొట్టుకుపోయింది. నిర్ణీత గడువు దాటినా తిరిగి రాలేదనే విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు... దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. స్వయంగా మంత్రులను పంపి గాలింపును పర్యవేక్షించారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఏమాత్రం ఆలస్యం చేయకుండా అన్ని మార్గాల ద్వారా గాలింపు చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఏ మాత్రం నిరాశ చెందకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని సూచించారు. కోనసీమ తీరం నుంచి పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండొచ్చనే అంచనాతో పశ్చిమ బెంగాల్ కోస్ట్ గార్డ్ విభాగాలను, అక్కడ స్థానికంగా ఉన్న శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ మత్స్యకారులను అప్రమత్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల సహకారాన్ని కూడా తీసుకున్నారు. అన్ని ప్రయత్నాలు ఫలించి శంకర్‌పూర్ సమీపంలో బోటును, అందులోని ఏడుగురు మత్స్యకారులను రక్షించగలిగారు. అలాగే మత్స్యకారుల ఆచూకీ లభ్యమైన వెంటనే ఆ వివరాలను వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులను స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

# నేపాల్ వరదల్లో ఏపీ యాత్రికుల వివరాలు సేకరిస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం.

### తెలుగు వారి క్షేమ సమాచారాన్ని సేకరిస్తోన్న ఆర్టీజీఎస్.

అమరావతి, మానస సరోవర యాత్రకు వెళ్లి చిక్కుకున్న వారిలో తెలుగు వారు... ప్రత్యేకించి ఏపీ వాసులు ఎవరైనా ఉన్నారని అధికారులు ఆరా తీస్తున్నారు. మానస సరోవర యాత్రను నిర్వహించే వివిధ టూరిస్ట్ సంస్థలు, ఏజెన్సీలతో మాట్లాడుతున్న అధికారులు, తిరుపతికి చెందిన 28 మందితో కూడిన యాత్రీకుల బృందం ఖాట్మాండులో ఉన్నట్టు గుర్తించారు.
ఖాట్మాండులోని యెల్లకొండ వద్ద ఒక హోటల్ లో తిరుపతి యాత్రీకుల బృందం బస చేసారు.

యాత్రీకుల క్షేమ సమాచారాన్ని తెలుసుకున్న ఆర్టీజీఎస్ అధికారులు,
ఎలాంటి సహాయం అవసరమైన తక్షణం తమను సంప్రదించాలని యాత్రీకులకు సూచనలు చేసారు. తామందరం క్షేమంగానే ఉన్నామని... తమను సంప్రదించినందుకు ధన్యవాదాలు తెలిపిన యాత్రీకులకు,మళ్లీ ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉందనే హెచ్చరికలు ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు.

# స్వీట్లు తినిపించి.. ఆశీస్సులు అందించి -- అనాథాశ్రమ బాలికలతో కలెక్టర్ రక్షాబంధన్ వేడుకలు



**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా సంవత్సరానికి ఒకసారి జరుపుకునే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోదరికి తన సోదరుడు కలకాలం రక్షగా, తోడుగా ఉంటాననే నమ్మకాన్ని, భరోసాను రాఖీ పండుగ ద్వారా కల్పిస్తాడని,అదే నమ్మకంతో అక్కాచెల్లెళ్లు తన సోదరులకు రక్షాబంధన్ కడతారని తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం పానగల్ లో ఉన్న చారుమతి అనాధాశ్రమ బాలికలు జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టారు. సోదరీ, సోదరుల ప్రేమానుబంధాలతోపాటు, వారికి రక్షగా నిలుస్తామనే భరోసాను కల్పించే రాఖి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు రాఖీలు కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా జాతీయ క్రీడా వారోత్సవాలు ప్రారంభం




**అక్షరకలం నల్గొండ**

?రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో జాతీయ క్రీడా వారోత్సవాలు --2026ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.?కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ మాట్లాడుతూ, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను పెంచుతాయని పేర్కొన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి అక్బర్ అలీ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రతిభావంతులను గుర్తించి మెరుగైన శిక్షణ, సదుపాయాలు అందిస్తామని తెలిపారు. హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డి. ఇమామ్ కరీం మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చన్నారు.?ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఖలీల్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శంభు లింగం, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, కోచ్‌లు యావార్, పవన్ పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని మైదానంలో ఉత్సాహంగా పోటీ పడ్డారు.

# అప్పు తీర్చమన్నందుకు ఘాతుకం

### మహిళను చంపి, ప్లాస్టిక్ డబ్బాలో కుక్కి పాతిపెట్టిన వైనం

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం ప్రాంతంలో రెండు నెలల క్రితం జరిగిన ఓ మహిళ కిరాతక హత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.50 లక్షలు తీసుకున్న ఓ మహిళ, తిరిగి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసిన బాధితురాలిని అత్యంత పాశవికంగా హతమార్చి వ్యవసాయ పొలంలో పాతిపెట్టిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసముండే ఆదిలక్ష్మి (32) అనే మహిళకు నిందితురాలు అధిక వడ్డీ ఇప్పిస్తానని నమ్మబలికింది. ఆమె మాటలను నమ్మిన ఆదిలక్ష్మి తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను విక్రయించడంతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసి దాదాపు రూ.50 లక్షల నగదును నిందితురాలికి ఇచ్చింది. అయితే ఎంత కాలమైనా డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో, తన సొమ్ము వెంటనే ఇవ్వాలంటూ ఆదిలక్ష్మి నిందితురాలిపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది.డబ్బు తిరిగి చెల్లించడం ఇష్టం లేని నిందితురాలు ఆదిలక్ష్మిని ఎలాగైనా అంతమొందించాలని పథకం రచించింది. డబ్బులు ఇస్తానని నమ్మించి తన ఇంటికి పిలిపించుకుని ఆమెను దారుణంగా హత్య చేసింది. అనంతరం నేరానికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండేందుకు మృతదేహాన్ని ఒక ప్లాస్టిక్ డబ్బాలో కుక్కి, సమీపంలోని వ్యవసాయ పొలంలో ఎవరికీ అనుమానం రాకుండా గుట్టుచప్పుడు కాకుండా పాతిపెట్టింది.భార్య ఎంతకీ కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో దర్యాప్తు ముమ్మరం చేసి నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
మెదక్ - సంగారెడ్డి - సిద్దిపేట

# అకాడమిక్ క్యాలెండర్‌లో నర్మెట విద్యార్థుల ఫోటో సిద్దిపేట జిల్లా విద్యా ప్రగతికి దక్కిన అరుదైన గుర్తింపు.. అకాడమిక్ క్యాలెండర్‌లో నర్మెట విద్యార్థుల ఫోటో

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 28:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం--విద్యాశాఖ ప్రచురించిన అకాడమిక్ క్యాలెండర్‌లో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల ఫోటో చోటు చేసుకుంది. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో గత మార్చి నెలలో రాష్ట్ర అభివృద్ధిని తెలిపే మేళా నిర్వహించారు. ఈ మేళాలో విద్యాశాఖ ప్రగతిని తెలిపే స్టాల్ ను జిల్లా విద్యా శాఖ ఏర్పాటు చేసింది. ఈ స్టాల్ ను నర్మెట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిర్వహించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభివృధి కార్యక్రమాల మేళాను సందర్శించారు. విద్యాశాఖ స్టాల్ వద్ద నర్మెట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారితో ఆత్మీయంగా ఫోటో దిగారు. ఈ ఫోటోను రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన అకాడమిక్ క్యాలెండర్‌లో మార్చి నెల పేజీలో ప్రచురించూడం విశేషం. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి విద్యా క్యాలెండర్‌లో తమ పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి మాట్లాడిన దృశ్యం ప్రచురితం కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ పేర్కొన్నారు.సాధారణంగా రాష్ట్ర స్థాయి ప్రచురణల్లో ఒక చిన్న




గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన ఫోటో చోటు చేసుకోవడం అరుదైన విషయమని ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అన్నారు. తమ పాఠశాలకు ఈ అవకాశం లభించడం ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు. ముఖ్యమంత్రి విద్యార్థులు, తల్లిదండ్రులతో మమేకమైన ఆ క్షణాన్ని విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో పొందుపరచడం ద్వారా నర్మెట పాఠశాల ప్రత్యేకత రాష్ట్ర స్థాయిలో ప్రతిబింబించిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యా వాతావరణం, పాఠశాల--తల్లిదండ్రుల అనుబంధం, విద్యార్థుల భాగస్వామ్యం వంటి అంశాలకు ఈ ఫోటో ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. తమ పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో ప్రచురితమైందన్న విషయం విద్యార్థుల్లోనూ ఉత్సాహాన్ని నింపిందని మనీష్ కుమార్ తెలిపారు. "మన పాఠశాల ఫోటో రాష్ట్రస్థాయి క్యాలెండర్‌లో రావడం ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రికి గర్వకారణం. ముఖ్యమంత్రి విద్యార్థులతో ముచ్చటించిన ఆ మధుర జ్ఞాపకం ఇప్పుడు అకాడమిక్ క్యాలెండర్ ద్వారా శాశ్వత గుర్తింపుగా నిలిచింది" అని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.నర్మెట వంటి గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఫోటో రాష్ట్ర విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో చోటు దక్కడం సిద్దిపేట జిల్లా విద్యారంగానికి, నంగునూరు మండలానికి, నర్మెటకి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ గుర్తింపు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రేరణ ఇస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

# రాఖీ పండుగ సందర్భంగా బాలసదనంలోని చిన్నారులతో ఆత్మీయంగా రాఖీ వేడుకలు

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 28:**

సిద్దిపేట పట్టణంలోని కల బాలసదనంలో రాఖీ పండుగ సందర్భంగా విఆర్ఆర్ టీం సభ్యులు చిన్నారులతో ఆత్మీయంగా రాఖీ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగాబాల సదనంలోని చిన్నారులకు దుస్తులు అందజేసి, వారితో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులతో రాఖీలు కట్టించుకుని, అన్నదమ్ముల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, అనుబంధం యొక్క గొప్పతనాన్ని వారికి తెలియజేశారు.సమాజంలో ప్రతి ఒక్కరి పట్ల ఆప్యాయత, మానవత్వంతో ఉండాలనే వంగ రాజేశ్వర్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా విఆర్ఆర్ టీం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పండుగలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, ఆప్యాయత అవసరమైన వారితో ఆనందాన్ని పంచుకున్నప్పుడే వాటికి నిజమైన అర్థం ఉంటుందని ఈ సందర్భంగా టీం సభ్యులు పేర్కొన్నారు.చిన్నారులతో కలిసి రాఖీ పండుగను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే తమకుఎంతోసంతృప్తినిచ్చిందని తెలిపారు.ప్రజల కష్టాల్లో తోడుగా నిలుస్తూ, ప్రతి కుటుంబానికి అండగా ఉంటూ, సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వంగ రాజేశ్వర్ రెడ్డి సేవా కార్యక్రమాలు సిద్దిపేటలో నిరంతరం కొనసాగుతాయని విఆర్ఆర్ టీం సభ్యులు తెలిపారు.



# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో నూతన విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాడుదాం....

## – బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల పోరాట ఫలితమే నేడు ఉచిత విద్యుత్......

## – సిపిఎం జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ......

**కొల్చారం, ఆగస్టు 28( అక్షర కలం)**

బషీర్ బాగ్ విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె నర్సమ్మ పిలుపునిచ్చారు.శుక్రవారం విద్యుత్ అమరవీరుల స్మారక దినం సందర్భంగా కొల్చారం మండలం కార్యాలయం లో 2000 సంవత్సరంలో బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అమరులైన బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ లను స్మరించుకుంటూ వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన జరిగిన కార్యక్రమంలో వెంకటస్వామి మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28వ తేదీన హైదరాబాద్ నగరంలో బషీర్ బాగ్ చౌరస్తా వద్ద విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి పోరాటం వృధా కాదని, వారి పోరాట స్ఫూర్తితో సాగించిన మహోజ్వల ఉద్యమంలో 2000 సంవత్సరం లో విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలపై భారాలు మోపకుండా ప్రభుత్వం వెనకడుగు వేసిందని, నాటి పోరాట ఫలితంగానే విద్యుత్ చార్జీలు పెంచాలంటే ప్రభుత్వాలు భయపడ్డాయని ఆమె అన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన



పోరాటం సందర్భంగా ఆగస్టు 28వ తేదీన హైదరాబాదులోని బషీర్ బాగ్ వద్ద ఆనాటి అధికార టిడిపి ప్రభుత్వం కాల్పులు జరిపి ముగ్గురిని బలి తీసుకున్నదని ఆ పోరాటం వల్ల నేడు రైతులకు ఉచిత కరెంటు, 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్తు అమలవుతున్నాయని అన్నారు. ప్రస్తుతం కేంద్ర బీజేపీ ప్రభుత్వం 2021 నూతన విద్యుత్ సవరణ బిల్లు తెచ్చి మళ్ళీ ప్రజలపై బారాలు మోపి కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.నూతన విద్యుత్ సవరణ చట్టం వల్ల రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి ఉచిత కరెంటుకు రైతులను దూరం చేసేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు. 2000 సంవత్సరంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం దుర్మార్గంగా కర్కశంగా వ్యవహరించి శాంతియుతంగా పోరాటం నిర్వహిస్తున్న ఉద్యమకారులపై కర్కశంగా వ్యవహరించి ప్రజల రక్తాన్ని కళ్ళ చూశారని, ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో మిలాఖత్ అయ్యి కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు,విద్యుత్ సంస్కరణలకు ఊతమిస్తున్నారని విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు డిస్కం తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రంలో రైతులపై భారాల మోపేందుకు సిద్ధపడుతోందని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు జరిపేందుకు సిద్ధపడుతున్నారని అన్నారు. విద్యుత్తు పోరాటంలో అమరులైన వీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయచూస్తున్న విద్యుత్తు సంస్కరణలను, విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను తిప్పికొట్టేందుకు ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా , లక్ష్మి,వీరమని,నర్సింలు, పోచయ్య,మహేశ్వరి,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రావణ మాసం అమ్మవారికి... ఆడపడుచులకు ప్రత్యేక మాసం

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు చల్లగా ఉండాలి

## సిద్దిపేట శ్రీ సంతోషి మాత అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 28 :**

శ్రావణ మాసం రాఖి పౌర్ణమి శ్రీ సంతోషి మాత అమ్మవారి పుట్టినరోజు సందర్బంగా సిద్దిపేట పట్టణం లోని శ్రీ సంతోషి మాత దేవాలయం లో అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్బంగా మాట్లాడుతు ఆడపడుచులకు రాఖి పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.శ్రీ సంతోషి మాత పుట్టినరోజున అమ్మవారి దర్శన భాగ్యం ఎంతో పుణ్యమని, అమ్మవారికి, ఆడపడుచులకు ఈ శ్రావణ మాసం ఎంతో పవిత్ర మైనది శ్రేష్ఠమైనదన్నారు.అమ్మవారి ఆశీస్సులతో అన్నింటా ప్రజలందరికి మంచి జరగాలని, చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.. ఈ సందర్బంగా ఆలయం లో అర్చకులు, ఆలయ ఈ ఓ హరీష్ రావు కి అమ్మవారి ప్రసాదం అందజేసి ఆశీస్సులు ఇచ్చారు. ఆలయం లో జరిగిన ఉద్యపాన పూజ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# నంగునూరు మండల వ్యాప్తంగా ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**అక్షర కలం సిద్దిపేట ఆగస్టు 28:**

నంగునూరు మండల వ్యాప్తంగా రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) వేడుకలు శుక్రవారం నాడు అత్యంత వైభవంగా, అట్టహాసంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే సోదరీమణులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తమ సోదరులకు నుదుట తిలకం దిద్ది, హారతులు ఇచ్చి రాఖీలు కట్టారు. తమ అన్నదమ్ములు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ మిఠాయిలు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉంటామని మాట ఇస్తూ, వారికి ప్రత్యేక కానుకలు, నగదు అందజేసి తమ ప్రేమను చాటుకున్నారు. పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని మార్కెట్లు, స్వీట్ షాపులు, రాఖీ స్టాళ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి సోదరుల వద్దకు వెళ్లే మహిళా ప్రయాణికులతో బస్సులు, రోడ్లన్నీ రద్దీగా మారాయి. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగ ప్రాముఖ్యతను చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మండల వ్యాప్తంగా భద్రతా చర్యలు పర్యవేక్షించారు. మండల ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మరియు వివిధ సంఘాల నాయకులు మండల ప్రజలందరికీ రక్షాబంధన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ఉమ్మడి కుటుంబాల ప్రాముఖ్యతను, కుటుంబ బంధాల మధురిమలను గుర్తుచేసిందని మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**అక్షర కలం సిద్దిపేట, ఆగస్టు 28:**

సోదర సోదరీమణుల ప్రేమానుబంధానికి, రక్షణకు ప్రతీక అయిన రక్షాబంధన్ పండుగకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, నంగునూర్, చేర్యాల, కొమురవెల్లి, మర్కూక్, మిరుదొడ్డి, నారాయణరావుపేట, అక్కన్నపేట, హుస్నాబాద్,కొండపాక,బెజ్జంకి, తొగుట, జగదేవ్ పూర్ తదితర అన్ని మండలాల్లో పండుగ శోభ సంతరించుకుంది. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని ప్రధాన బజార్లు, చౌరస్తాల్లో రంగురంగుల రాఖీలు, మిఠాయిలు, బహుమతులతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. సోదరీమణులు తమ సోదరులకు కట్టేందుకు వివిధ డిజైన్లలో రూపొందించిన రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక పట్టణాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలల్లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు, పోలీసు అధికారులకు రాఖీలు కట్టి గౌరవాన్ని చాటుకుంటున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు జిల్లాలోని అనాథ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో రాఖీ పండుగను జరుపుతూ మానవత్వాన్ని చాటుతున్నాయి.సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల ప్రజలకు, అక్కాచెల్లెళ్లకు, అన్నతమ్ములకు, అఖండ సూర్య దినపత్రిక పాఠకులకు, జిల్లా, మండల ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, పోలీసు శాఖకు రక్షాబంధన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర బంధం జిల్లా ప్రజలందరి మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు.

## జోగిపేటలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**అక్షర కలం, అందోలు:**

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో శుక్రవారం పద్మశాలి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో ఉన్న శ్రీ భక్త మార్కండేయ మందిరంలో ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పాలాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కుల పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పవిత్ర శివధనస్సును భుజాన ధరించి పాదయాత్రగా పద్మశాలి భవన్ కు చేరుకున్న తర్వాత అక్కడ శివధనస్సుకు, భక్త మార్కండేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి భజన బృందాల కోలాహలం, భక్తి గీతాల నడుమ మధ్యరంగం, తూర్పుగౌని, పోచమ్మ దేవాలయం మీదుగా కొనసాగిన శివధనస్సు ఊరేగింపు స్థానిక ప్రసిద్ధ జోడి లింగాల శ్రీ జోగినాథ స్వామి ఆలయానికి చేరుకుంది. అక్కడ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హారతి పూజలు నిర్వహించి శివధనస్సు ఊరేగింపును ముగించారు. ఈ సందర్భంగా పద్మశాలి చేనేత సహకార సంఘం కులస్తులు, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ "రాఖీ పౌర్ణమి అనేది



పద్మశాలి కులానికి అత్యంత పవిత్రమైన పర్వదినమని, కుల దైవం భక్త మార్కండేయుని జయంతిని జరుపుకోవడం, శివధనస్సు ఊరేగింపు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడంతో పాటు కులంలో ఐక్యతను చాటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులను, వేద పండితులను చేనేత సంఘం తరపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పడగే సత్యం, పాలకవర్గ సభ్యులు చిట్యాల మధు, మెట్టు రమేష్, అనంత్ రాజ్ తో పాటు కుల పెద్దలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955

అక్షరకలం
తెలుగు దినపత్రిక
ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం

# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

## బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి -- కలెక్టర్ అంకిత్ .

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:-




రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి కి మరియు ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "బేటీ బచావో -- బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలికను కాపాడుదాం బాలికను చదివిద్దాం బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం బాలికల్లో ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, కుటుంబ అనుబంధం పెంపొందించేలా ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ మరియు బాలికలు పాల్గొన్నారు.

# భద్రాచలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు.

అక్షర కలం / భద్రాచలం





భద్రాచలం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ.శరత్ ఆధ్వర్యంలో సుమారు 15 కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్స్, ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. మిఠాయిలు, క్యాండీలు, ప్యాకేజ్డ్ ఫుడ్ తదితరాల నాణ్యత, ప్యాకింగ్, లేబులింగ్, గడువు తేదీలు, నిల్వ విధానాలను పరిశీలించారు. నాణ్యతపై అనుమానం ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా, వినియోగానికి అనర్హంగా ఉన్న సుమారు 30 కిలోల ఆహార పదార్థాలను గుర్తించి డిస్కార్డ్ చేయించారు. ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఖీూూ× ఫుడ్ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని అధికారులు సూచించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయడంతో పాటు ఖీూూ× నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ.శరత్ తెలిపారు.

# సొంత ఊర్లో ఆర్డీవో మంగీలాల్ అంత్యక్రియలు

- తండోప,తండాలుగా తరలివచ్చిన ప్రజలు

అక్షర కలం/ మహబూబాబాద్:



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న కొరివి మండలం లింగయ్య తండా. వారి సొంత ఊరు వివిధ జిల్లాలలో ఆర్డీవో గా ఎమ్మార్వోగా. ఆర్డిఓ గా పనిచేసి. మధ్య తరగతి కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయకురించిన వ్యక్తి. నిరుపేద కుటుంబంలో జన్మించి. మచ్చలేని చందమామ . పనిచేసిన వ్యక్తి పూర్తిస్థాయిలో ప్రజలకు.. చేదోడువాదులుగా ఉండేవాడు నాలుగు నెలల నుంచి ఆరోగ్యంగా. చీలించిపోయింది హాస్పిటల్లో ఉండి. సాయంత్రం సమయంలో. గురువారం 6 గంటల సమయంలో. తుది శ్వాస వదిలేయారు. . ప్రస్తుతం వికారాబాద్ జిల్లా ఆర్డీవో గా పని చేస్తూ ఉన్నారు.

మాలోత్ మంగీలా నాయక్ అంతక్రియలో ఈరోజు శుక్రవారం 28,బలపాల శివారు లింగాతండాలో జరిగాయి అంత్యక్రియలో తండ ప్రజలు వికారాబాద్ ఆర్డిఓ, కలెక్టరేట్ ఏవో,ఖమ్మం ఆర్డీవో , భద్రాచలం ఆర్డీవో, నర్సంపేట ఆర్డీవో, ఎమ్మార్వో, వివిధ మండలాలు చెందిన ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, సబ్ కలెక్టర్స్, తమ బంధుమిత్రులు, తండ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి...! నేతాజీ వాకర్స్ క్లబ్ డిమాండ్...

అక్షర కలం/ పినపాక..



## స్టేడియంలో నిరంతర పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలి...అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...

మణుగూరు పట్టణంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్టేడియంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని నేతాజీ వాకర్స్ క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు.యువకులు, విద్యార్థులు పోలీసు, ఆర్మీ సెలక్షన్స్ కోసం, క్రీడాకారులు, వాకర్స్ నిత్యం ప్రాక్టీస్ చేసుకునే ఈ స్టేడియం పరిసరాల్లో కొంతకాలంగా మద్యం, డ్రగ్స్, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నిన్న గ్రౌండ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని ఒక యువకుడు మృతి చెందడం బాధాకరమని, స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు.క్రీడలు, ఆరోగ్యం, యువత అభివృద్ధికి ఉపయోగపడాల్సిన స్టేడియంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

వాకర్స్ క్లబ్ ప్రధాన డిమాండ్లు:

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ పెంచాలి...సాయంత్రం, రాత్రి వేళల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలి...గురువారం జరిగిన ఘర్షణపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..ఈ కార్యక్రమంలో నేతాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సామ శ్రీనివాస రెడ్డి, రావులపల్లి రామమూర్తి, గౌరవ అధ్యక్షులు నాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, పుచ్చకాయల శంకర్, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, కటకం సతీష్, కోశాధికారి వడ్డాణం రమేష్, ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ వెంకటేశ్వరావు, దేశబోయిన తిరుపతిరావు, హేమాద్రి,భద్రు, హాతీరామ్, ప్రసాద్, కె. శ్రీనివాస్, వెంకటేశ్వరావు,వాగబోయిన నాగేశ్వరరావు, సిహెచ్ రమేష్, సురేందర్ రెడ్డి, ఎ.కిషన్, వినీల్, రామిరెడ్డి, కంచర్ల మురళి, రవీందర్, సిహెచ్ రాము తదితరులు పాల్గొన్నారు.

# మహిళపై అత్యాచార కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్ :

--- రిమాండ్‌కు తరలింపు: - డీఎస్పీ మహేష్ :

నారాయణపేట, ఆగస్టు,28(అక్షర కలం)

మక్తల్ పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేపట్టి, మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 53 ఏళ్ల మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. ఈ కేసు మోహకంగా మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ ఐ ఆర్ నెంబర్.342/2026, సెక్షన్ 70(1) బిఎన్ఎస్ కింద నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఘటన సమాచారం అందగానే పోలీసులు బాధితురాలిని రక్షించి మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మహిళా ఎస్ఐ బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు దర్యాప్తు వేగవంతం చేసి మక్తల్‌కు చెందిన బోయ అరవింద్ (19) మరియు బోయ విజయ్ (19) అనే ఇద్దరు వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ మహేష్ చెప్పారు. ఈ కేసు త్వరగా ఛేదించడంలో మక్తల్ సీఐ రామ్లాల్, ఎస్సై రాజు మరియు ఇతర పోలీస్ సిబ్బందిని డీఎస్పీ మహేష్ అభినందించారు. డీఎస్పీ మాట్లాడుతూ, మహిళలపై చోటుచేసుకునే నేరాలపై చట్టం మేరకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతను అత్యధిక ప్రాధాన్యతగా తీసుకుంటుందని, బాధితురాలకు అవసరమైన అన్ని పోలీసు సహాయాన్ని అందిస్తామని పేర్కొన్నారు. దర్యాప్తు మరియు చట్టపరమైన తదుపరి చర్యలు జరుగుతున్నాయని డీఎస్పీ మరింత చెప్పారు.




# మక్తల్ పట్టణంలో మహిళపై అత్యాచారం అత్యంత దారుణం!

## నిందితులను కఠినంగా శిక్షించాలి!

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్

నారాయణపేట, ఆగస్టు, 28 (అక్షర కలం)



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్న రైజింగ్ తెలంగాణ లో మహిళలకు రక్షణ కరువైందని బీఎస్పీ నారాయణ పేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ విమర్శించారు.శుక్రవారం మరికల్ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో మహిళపై జరిగిన సామూహిక అత్యాచారశీ అత్యంత దారుణమన్నారు.మంత్రి ఇలాకాలో మహిళలకు రక్షణ ఏ విధంగా ఉన్నదో తాజా ఘటనే నిదర్శనమన్నారు.మక్తల్ వ్యాప్తంగా ఇసుక దోపిడి మీద ఉన్న ధ్యాస ప్రజల రక్షణపై లేకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు మత్తు,గంజాయి బ్యాచ్ అత్యంత దారుణాలకు, అత్యాచారాలకు పాల్పడుతుంటే హోమ్ మంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ఊకదంపుడు మాటలతో ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు.రాష్ట్రంలో ఉన్న యాచకులకు ప్రభుత్వ పరంగా రక్షణ కల్పించాలని,నిందితులను కఠినశీగా శిక్షించాలన్నారు.

# జేకే-5 పూసపల్లి ఓసీ నిర్వాసితులకు, న్యాయం చేయాలి---- సర్పంచ్ చందావత్ రమేష్ బాబు.

అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-



ఇల్లందు సింగరేణి జేకే-5 పూసపల్లి ఓపెన్‌కాస్ట్ (ఓసీ) ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కావడం పట్ల సర్పంచ్ రమేష్ బాబు హర్షం వ్యక్తం చేస్తూనే నిర్వాసితులకు న్యాయం చేయాలని వారికి సంబంధించిన అనేక విషయాలో అధికారులు ఒక నిర్ణయం తీసుకోవాలని అనేక అనుమానాలతో సతమతమవుతున్న నిర్వాసితులకు స్పష్టమైన నిర్ణయాలతో న్యాయం చేయాలని విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందావత్ రమేష్ బాబు సింగరేణి యాజమాన్యాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేకే-5 పూసపల్లి ఓసీ ప్రాజెక్టు అనుమతులు రావడంతో ఇల్లందుకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందని అనేక కార్మిక కుటుంబాల తో మళ్ళీ కళకళలాడుతుందని ఆనందాన్ని వ్యక్తం చేస్తూనే మరియు మౌలిక వసతుల విషయంలో తగిన న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రాజెక్ట్ పరిధిలో లేని ప్రాంతాలను రెవిన్యూ కు ఇచ్చి పట్టాలు ఇవ్వాలి అని కోరారు. ఓసి పరిధిలో నిర్వాసితులుగా గుర్తించబడిన విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీ లోని నిర్వాసిత కుటుంబాలకు స్పష్టమైన న్యాయం చేయాలని, ఇప్పటికే 160 ఇళ్లకు కు పైన నెంబరింగ్ వేశారని ఇంకా కొని ఇళ్లకు నెంబర్ వేయాల్సిన కుటుంబలు కూడా గుర్తించారని ఇంకా వాటికి నెంబర్ వేయలేదని వాటిపై కూడా స్పష్టత ఇవ్వాలని ఇల్లు కోల్పోతున్న కుటుంబాలకు, ప్యాకేజి పై స్పష్టత ఇవ్వాలని ఇక్కడున్న నిరుపేద ఆదివాసి,గిరిజన కుటుంబాలకు తోపాటు మిగిలిన ఎస్సీ బీసీలకు కూడా న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సర్వే తో ముందుకొచ్చిన అధికారులను ఆనాడు అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో అడ్డుకుంటే అన్ని ఇప్పిస్తామని మాట్లాడి సర్వే చేసుకున్న తర్వాత ఇది మా భూమి అని ఏమి ఇవ్వమని సింగరేణి అధికారులు రెండు ధోరణిలతో మాట్లాడిన వైనం స్థానిక ప్రజలు చూశారని తిరిగి అలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఓసి పరిధిలో నష్టపోతున్న రైతాంగానికి కూడా న్యాయం చేయాలని, ఎన్నో ఏళ్లుగా భూమిని నమ్ముకొని వ్యవసాయం సాగు చేసుకుంటున్నా స్థానిక రైతులను భూమి మీదకి రానీయకుండా సంవత్సరాలుగా సింగరేణి వ్యవస్థ ఆదుకుంటుందని దానికి కూడా తగిన న్యాయం చేసి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై అధికారులపై ఉందని చందావత్ రమేష్ బాబు అన్నారు. ప్రభుత్వం కూడా అదిశగా ఆలోచించాలని, ఏది ఏమైనప్పటికీ సింగరేణి జెకె పై ఓ సి లో ప్రారంభించే ముందే నిర్వాసితులకు న్యాయం చేస్తే అని సజావుగా సాగుతాయని లేదంటే తప్పకుండా నిర్వసితుల పక్షాన గ్రామపంచాయతీ పాలకవర్గంగా న్యాయం చేసేలాగా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# నీట్--పీజీ 2026 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు..... అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

## ఖమ్మం జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలు -- 668 మంది విద్యార్థులు హాజరు

## ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతి

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :

ఖమ్మం జిల్లాలో ఆగస్టు 30న ఆదివారం నిర్వహించనున్న నీట్--పీజీ 2026 పరీక్షను ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో నీట్--పీజీ 2026 పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని అయాన్ డిజిటల్ జోన్, లక్ష్య కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఒక కేంద్రం, ఖమ్మంలోని పాకబండ బజార్‌లోని స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 668 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.పరీక్ష ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పిడీసీఎల్ అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో హెల్త్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పోలీస్ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.పరీక్షల పర్యవేక్షణ కోసం జిల్లాలో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 7:00 గంటల నుంచి 8:30 గంటల వరకు మాత్రమే పరీక్షా హాలులోకి అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా కలర్ ప్రింట్ ఔట్ అడ్మిట్ కార్డుతో పాటు ఫోటోతో కూడిన ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఎం.బి.బి.ఎస్. పర్మనెంట్/ప్రొవిజనల్ మెడికల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలర్ జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్ అనుమతించబడవని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్షా నిబంధనలను తప్పని సరిగా పాటిస్తూ, ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.






# కొడుకుగా స్వీకరించాలంటూ తల్లి, కుమారుడి ధర్నా

గద్వాల్ టౌన్ అక్షరకలం:

జోగులాంబ గద్వాల జిల్లా చింతరేవులచిన్నతనంలో తనను ఇంట్లో పనికి పెట్టుకుని, అనంతరం మాయమాటలు చెప్పి తనపై లైంగిక దాడికి పాల్పడి గర్భం దాల్చేలా చేశాడని రేణమ్మ అలియాస్ రేణుక ఆరోపించారు. తనకు పుట్టిన కుమారుడిని తండ్రిగా చక్రపాణి గుర్తించి స్వీకరించాలని డిమాండ్ చేస్తూ రేణుక తన కుమారుడితో కలిసి చింతరేవుల బాపనయ్య చక్రపాణి ఇంటి ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు.రేణుక తెలిపిన వివరాల ప్రకారం.. తాను సుమారు ఐదేళ్ల వయసులో చక్రపాణి ఇంట్లో పనికి చేరానని, అక్కడే తింటూ, పడుకుంటూ, అక్కడే ఉంటూ పెరిగానని చెప్పారు. తనకు సుమారు 13 ఏళ్ల వయసు ఉన్న సమయంలో మాయమాటలు చెప్పి లైంగికంగా వేధించడంతో గర్భం దాల్చానని ఆరోపించారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో తల్లిదండ్రులు తనను అక్కడి నుంచి తీసుకెళ్లారని తెలిపారు.గర్భం విషయం చక్రపాణికి చెప్పగా టాబ్లెట్లు వేసుకుంటే గర్భం పోతుందని చెప్పడంతో వాటిని తీసుకున్నప్పటికీ గర్భస్రావం కాలేదని, అనంతరం తాను ఓ బిడ్డకు జన్మనిచ్చినట్లు రేణుక తెలిపారు. ప్రస్తుతం తన



కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడని, తన తండ్రి ఎవరని అడుగుతున్నాడని, అందుకే చక్రపాణి తమను తల్లి, కుమారుడిగా గుర్తించి అంగీకరించాలని కోరుతున్నట్లు చెప్పారు.తమ సమస్యపై మాట్లాడితే చంపేస్తానని, చేతబడి చేసి చంపుతానని బెదిరిస్తున్నాడని రేణుక ఆరోపించారు. అంతేకాకుండా రూ.10 లక్షలు ఇస్తామని, డబ్బు తీసుకుని ఈ విషయం గురించి మాట్లాడకుండా వెళ్లిపోవాలని చక్రపాణి చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. అయితే తమకు డబ్బు అవసరం లేదని, తన కుమారుడికి తండ్రి గా గుర్తింపు, తనకు న్యాయం కావాలని రేణుక స్పష్టం చేశారు.చక్రపాణి ఇంటి ఎదుట తల్లి, కుమారుడు బైఠాయించడంతో స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. చిన్న వయసులో జరిగిన ఘటనపై రేణుక చేసిన ఆరోపణలు, ప్రస్తుతం ఆమె చేస్తున్న న్యాయపరమైన డిమాండ్లపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## రక్షాబంధన్ వేడుకల్లో ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్



అక్షర కలం, అందోలు:

రాఖీ పౌర్ణమి సందర్భంగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన సోదరీమణులు బీఆర్ఎస్ నాయకులు, ఎండీర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ సోదరీమణులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రక్షాబంధన్ సోదర--సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, విశ్వాసం, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరికీ రక్షాబంధన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండగ -నీలం మధు ముదిరాజ్



అక్షర కలం, అందోలు:

అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. రక్షాబంధన్ ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా చిట్కుల్ లోని ఆయన నివాసంలో పలువురు మహిళామణులు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలం మధు వారికి మిఠాయిలు ఆప్యాయంగా పలకరించారు. మహిళలను గౌరవిస్తూ రక్షణగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

## పౌర్ణమి రద్దీతో కిక్కిరిసిన బస్టాండ్లు :



నారాయణపేట, ఆగస్టు,28(అక్షర కలం)

మరికల్: రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికుల ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఆగస్టు 27 నుంచి 31 వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని గత ఏడాదితో పోలిస్తే ఈసారి 240 బస్సులు అదనంగా ఏర్పాటు చేశారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణ సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.మరికల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగి కిటకిటలాడుతోంది. సొంతూళ్లకు వెళ్లే వారు పెద్ద సంఖ్యలో చేరడంతో బస్టాండ్ ప్రాంగణం రద్దీగా మారింది.

## దైవ దర్శనానికి వెళ్తూ ఏఎస్ఐ కన్నయ్య మృతి

గద్వాల్ టౌన్ అక్షరకలం



నిబద్ధత కలిగిన అధికారిని కోల్పోయాం.. జిల్లా పోలీసు వ్యవస్థకు తీరని లోటు: ఎస్పీ శ్రీనివాసరావుగద్వాల: దైవ దర్శనానికి వెళ్లిన జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖకు చెందిన ఏఎస్ఐ కన్నయ్య గారు ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. గురువారం రాత్రి తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లిన ఆయన, మొక్కు తీర్చుకునే క్రమంలో మెట్ల మార్గం గుండా కాలినడకన కొండపైకి వెళ్తుండగా ప్రయాణం చివరి దశలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పోలీస్ శాఖ వెల్లడించింది.1989 బ్యాచ్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరిన కన్నయ్య, తన 37 సంవత్సరాల 8 నెలల సుదీర్ఘ పోలీస్ సేవలో హెడ్ కానిస్టేబుల్‌గా, అనంతరం ఏఎస్ఐగా పదోన్నతులు పొందారు. వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ విశేష సేవలు అందించారు. నిబద్ధత, సౌమ్యత, బాధ్యతాయుతమైన పనితీరుతో ఉన్నతాధికారులు, తోటి సిబ్బంది, ప్రజల మన్ననలు పొందారని అధికారులు తెలిపారు.ప్రస్తుతం జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న కన్నయ్య ఆకస్మిక మృతి పట్ల జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు అంకితభావంతో సేవలందించిన మంచి అధికారి, మంచి మనిషిని కోల్పోవడం జిల్లా పోలీస్ వ్యవస్థకు తీరని లోటని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ శ్రీ కె. శంకర్‌తో పాటు జిల్లా పోలీసు అధికారులు, సహచర సిబ్బంది కన్నయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సేవలను స్మరించుకున్నారు. అనంతరం దహన సంస్కారాల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.కన్నయ్య కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి జిల్లా పోలీస్ శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. రక్షాబంధన్



గద్వాల్ టౌన్ అక్షరకలం:

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే ఈ పండుగ సందర్భంగా మహిళలు తమ సోదరుల మణికట్టుకు రాఖీలు కట్టి వారి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను ఆకాంక్షించారు.రాఖీ కట్టిన అనంతరం సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బహుమతులు అందించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులు ఒకచోట చేరడంతో ఇళ్లలో సందడి నెలకొంది. పట్టణాలు, గ్రామాల్లో రాఖీల విక్రయాలు జోరుగా సాగాయి.రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే సంప్రదాయమే కాకుండా.. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, నమ్మకం, ఆప్యాయతను మరింత బలపరిచే పండుగగా నిలుస్తోంది. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరులు సైతం స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం సందర్భంగా జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది.

## రాఖి పౌర్ణమి సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు రాఖీలు కట్టిన బాల సదనం పిల్లలు



గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నందు బాల సదనం పిల్లలు జిల్లా కలెక్టర్ కు రాఖిలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,చిన్నారులు చూపించిన ప్రేమ మరియు ఆప్యాయత నాకు ఎంతో ఆనందం కలిగించింది.వారితో కలిసి ఈ పండుగను జరుపుకోవడం నాకు సంతోషంగా ఉందని అన్నారు. అలాగే, బాల సదనం పిల్లల చదువు, ఆరోగ్యం కొరకు ప్రభుత్వం అంకిత భావంతో పనిచేస్తుంది, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిపిఓ నర్సింహులు,సూపరిడెంట్ వెంటేశ్వరి,పి.ఓ.ఐ.సి ఇంచార్జ్ సురేష్,చిన్నారులు,తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ దారం కాదు.. జీవితాంతం తోడుగా నిలిచే భరోసా!

### అన్నాచెల్లెళ్ల అనుబంధానికి అద్దం పట్టే రక్షాబంధన్

గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

చేతికి కట్టే చిన్న రాఖీ.. మనసులను కలిపే పెద్ద బంధానికి ప్రతీక. చిన్ననాటి అల్లరి నుంచి జీవితంలోని ఎన్నో మలుపుల వరకు ఒకరికొకరు తోడుగా నిలిచే అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని గుర్తు చేసే పవిత్రమైన పండుగే రాఖీ పౌర్ణమి. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు.. పుట్టింటి జ్ఞాపకాలతో ఆడపడుచుల కళ్లలో ఆనందం కనిపిస్తుంది. అన్నను చూసిన వెంటనే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. చేతికి రాఖీ కడుతూ "నువ్వు ఎప్పటికీ నాకు అండగా ఉండాలి" అని కోరే చెల్లెలి మనసులో ప్రేమ ఉంటుంది. రాఖీకి బహుమతి ఇచ్చే అన్న చేతిలో మాత్రం "నీకు ఏ కష్టం వచ్చినా నేను ఉన్నాను" అనే భరోసా ఉంటుంది. బహుమతి విలువ కాదు.. బంధం విలువ ముఖ్యం



## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి.

సిబ్బందికి అనుగుణంగా ఓపీల సంఖ్య పెరగాలి.

పలువురు ఉద్యోగులు ఎక్కువగా సెలవులు పెట్టడంపై కలెక్టర్ ఆగ్రహం.



గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు డాక్టర్లు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం ఆలంపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పని చేస్తున్నప్పటికీ అనుకున్న స్థాయిలో రోగులు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇక్కడ సరైన వైద్య సేవలు అందించకుండా కర్నూల్ కు, ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులను హెచ్చరించారు. ఆసుపత్రిలోని పలువురు రోగులను పలకరించి వారి సమస్యలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వారికి అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఇన్ పేషెంట్లను ప్రతి రోజు వారి ఆరోగ్య పరిస్థితిని అనుసరించి తరచూ పరీక్షిస్తూ ఉండాలని, ఆహారాన్ని మెనూ ప్రకారం అందజేయాలన్నారు. ల్యాబ్ ను తనిఖీ చేసి ప్రతిరోజు వివిధ రకాల పరీక్షలను పక్కాగా చేస్తూ రోగులకు రిపోర్టును సకాలంలో అందజేయాలని ఆదేశించారు. గైనిక్, యూఎస్ జీ, ఫార్మసీ, ఈసీజీ, తదితర విభాగాలను సందర్శించి అక్కడి సిబ్బంది పనితీరును గమనించారు. హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది ఎక్కువగా సెలవులు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సరైన పనితీరు కనబరచకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్ద ఎత్తున పారిశుద్ధ్య సిబ్బంది పనిచేస్తున్నందున ఆసుపత్రినీ శుభ్రంగా ఉంచాలని, పరిసరాల్లోని పొదలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. బయో మెడికల్ వేస్టేజీ నిర్వహణకు ఏజెన్సీని నియమించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రహరీ కొంత భాగం కూలిపోవడాన్ని గమనించిన కలెక్టర్ మరమ్మత్తులు చేయిస్తామని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆసుపత్రి పర్యవేక్షకులు సయ్యద్ పాషా, ఉండవెల్లి మండల తహసిల్దారు ధరణి షా, తదితరులున్నారు.

## తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డికి రాఖి కట్టి శుభాకాంక్షలు తెలిపిన.. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య

గద్వాల్ అక్షర కలం ప్రతినిధి

హైదరాబాద్: రాఖీ పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఏనుముల రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య ( టీజీ ఎస్ జి డిసి ఎఫ్ ఎల్) చైర్‌పర్సన్ శ్రీమతి సరిత తిరుపతయ్య రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం కి ఆయురారోగ్యాలు,



సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మరింత విజయవంతం కావాలని సరిత తిరుపతయ్య ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పశుపోషకులు, గొర్రెలు మరియు మేకల పెంపకందారుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# ఫాస్ట్ ఫుడ్ వల్ల అనారోగ్యం

## ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ప్రమాదం

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28:**





నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫాస్ట్ ఫుడ్‌కు ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. సమయం ఆదా అవుతుందనే కారణంతో పిల్లలు, యువతతో పాటు పెద్దలు కూడా బర్గర్లు, పిజ్జాలు, నూడుల్స్, ఫ్రెంచ్ ఫ్రైస్, ప్యాకెట్ స్నాక్స్, శీతల పానీయాలు వంటి ఆహార పదార్థాలను అధికంగా తీసుకుంటున్నారు. అయితే రుచికోసం తరచూ ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఫాస్ట్ ఫుడ్‌లో సాధారణంగా అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు, కేలరీలు ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల అధిక బరువు, ఊబకాయం, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు వంటి అనారోగ్య సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అంతేకాకుండా తాజా కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలు తక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియకు కూడా ఇబ్బందులు కలగవచ్చు.

### పిల్లలపై ఎక్కువ ప్రభావం

చిన్న వయసులోనే ఫాస్ట్ ఫుడ్ అలవాటుగా మారితే పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు తగ్గే అవకాశం ఉంది. ఇంటి ఆహారం కంటే బయట ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పోషకాహార లోపాలు ఏర్పడవచ్చు. అధిక చక్కెర కలిగిన పానీయాలు, ప్యాకేజ్డ్ స్నాక్స్ దంత ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయి.

### పరిశుభ్రత కూడా కీలకం

ఫాస్ట్ ఫుడ్‌లో పదార్థాల నాణ్యతతో పాటు తయారీ, నిల్వ, వంట చేసే ప్రదేశాల పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యం. అపరిశుభ్రమైన నీరు లేదా కలుషితమైన పదార్థాలతో తయారైన ఆహారం తీసుకుంటే ఆహార విషబాధ, విరేచనాలు, వాంతులు వంటి సమస్యలు తలెత్తవచ్చు.

### ఆరోగ్యకరమైన ఆహారమే మేలు

ఫాస్ట్ ఫుడ్‌ను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేకపోయినా, దాని వినియోగాన్ని పరిమితం చేయడం మంచిది. ఇంట్లో తయారుచేసిన తాజా ఆహారం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలకు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను తల్లిదండ్రులు, పాఠశాలలు ప్రోత్సహించాలి. రుచి కోసం క్షణిక ఆనందం కంటే ఆరోగ్యం కోసం జీవితాంతం జాగ్రత్త ముఖ్యం. ఫాస్ట్ ఫుడ్ తగ్గిద్దాం -- ఆరోగ్యకరమైన ఆహారాన్ని పెంచుదాం అనే సందేశాన్ని ప్రతి కుటుంబం పాటించాల్సిన అవసరం ఉంది.

**ప్రజా జాగృతి సమితి అధ్యక్షులు, అడ్వకేట్ రాజలింగు మోతె**

అక్షరకలం
తెలుగు దినపత్రిక
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్న సిరిసిల్ల

## ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ పై, అభ్యంతరాల స్వీకరణ



**వీణవంక, ఆగస్టు28 ( అక్షర కలం ):**

వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో శుక్రవారం ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ ఓటర్ లిస్టుపై అభ్యంతరాలను తహసీల్దార్ ముద్దసాని రమేష్ స్వీకరించారు. తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో డ్రాఫ్ట్ లిస్టులోని అవకతవకలు, నాన్ మ్యాపింగ్, ఓటు నమోదు తీరును పరిశీలించి సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఓటర్ల నుండి అభ్యంతరాలు స్వీకరించారు..ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కాదిల్ జిపిఓ నవీన్ ఉప సర్పంచ్ మడ్డి మహేష్, కరోబార్ మహేష్ గ్రామస్తులు పాల్గొన్నారు...

# మూడు నవలల ముచ్చటపై సాహిత్య సభ

**అక్షర కలం నాగర్ కర్నూల్ ప్రతినిధి :**



పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో 'మూడు నవలల ముచ్చట' పేరుతో ఈ నెల 30న మహబూబ్‌నగర్‌లోని అరుంధతి భవన్‌లో సాహిత్య సభ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం కవులు, రచయితలు, కళాకారులు ఆవిష్కరించారు.సభలో నాగర్‌కర్నూల్‌కు చెందిన నవలా రచయిత బెక్కెం జనార్ధన్ రచించిన 'పండుగ సాయన్న', ఆమ్‌గోత్ వెంకట్ పవార్ రచించిన తొలి తెలుగు గోర్ బంజారా చారిత్రక నవల 'పోర్య తార', పూర్వ తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి రచించిన 'నాగటితరం' నవలల పరిచయం, సమీక్షలు ఉంటాయని తెలిపారు.ఈ మూడు నవలలు తెలంగాణ మట్టి పొత్తిళ్లలోని చరిత్ర, సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. రెండు వందల ఏళ్ల పాలమూరు, తెలంగాణ ప్రాంతాల సామాజిక స్థితిగతులకు ఇవి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలిపారు. సామాన్యులు నాయకులుగా మారి తిరుగుబాటు చేసిన గాథలు, అప్పటి ప్రజల జీవన పరిస్థితులు, కష్టాలు, కన్నీళ్లు, ప్రజా ఉద్యమాలు తదితర అంశాలు సభలో చర్చకు రానున్నాయని వివరించారు. సాహిత్య సభను విజయవంతం చేసేందుకు కవులు, రచయితలు, కథకులు, నవలాకారులు, ప్రజా ఉద్యమకారులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక కన్వీనర్ గుడిపల్లి నిరంజన్, సీనియర్ జర్నలిస్ట్ కందికొండ మోహన్, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి, ప్రముఖ కవి ఎదిరేపల్లి కాశన్న, 'పోర్య తార' నవల రచయిత వెంకట్ పవార్, ఎండి ఖాజా, గౌస్ పాష కోరారు.

## ప్రజలపై భారాలు మోపుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి



**గద్వాల్ టౌన్ అక్షరకలం:**

గద్వాల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు విమర్శించారు. ధరల పెరుగుదల, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.జోగులాంబ గద్వాల జిల్లా సీపీఐ కార్యాలయంలో శుక్రవారం చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను పార్టీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మరోవైపు దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు రూపొందిస్తూ రైతులు, కార్మికులు, యువత, పేదల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు.ధరల పెరుగుదలను అరికట్టాలని, రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆంజనేయులు కోరారు. ప్రజల హక్కుల కోసం జరిగే ఈ పోరాటాన్ని విజయవంతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రంగన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరమేష్, సీపీఐ నాయకులు రామాంజనేయులు, వెంకటేష్, గోకారి తదితరులు పాల్గొన్నారు.

## అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ వేడుకలు

**మందమర్రి, ఆగస్టు 28 అక్షర కలం:**

పవిత్రమైన అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిర్వహించు పండుగ రక్షా బంధన్, తోబుట్టువులకు పవిత్రమైన పండుగ, శుక్రవారం రక్షాబంధన్ పండుగ వేడుకలను జిల్లాలో ప్రజలు ఎంతో అనురాగ, ఆప్యాయతలు నడుమ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరునికి రక్ష (రాఖీ)ని కట్టి, తమ అనుబంధాన్ని చాటారు. ప్రతి కష్టంలో సోదరులు తోడుంటారనే విశ్వాసానికి గుర్తుగా ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రక్షాబంధన్ (రాఖీ పండుగ) సోదరీ సోదరీమణులు ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని ఈ పండుగ గుర్తు చేస్తుంది. రాఖీ అంటే రక్షణ అని, సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి, జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఎల్లవేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తూ, సోదరుని చేతికి రాఖీని కడతారు.




### మార్కెట్లో పండుగ శోభ...

రాఖీ పండుగ నేపథ్యంలో నగరంలోని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రాఖీల విక్రయ దుకాణాల్లో రకరకాల రాఖీల విక్రయాలతో జోరందుకున్నాయి. గత మూడు రోజులుగా స్టాల్స్ పెట్టి, రాఖీలు విక్రమిస్తున్నారు. మార్కెట్లో వివిధ ధరల్లో పలు రకాల రాఖీలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. శ్రావణ శుక్రవారం కలిసిరావడం, పాఠశాలలు, కళాశాలలకు వరుసగా సెలవు రావడంతో నగరంలో మార్కెట్ కూడళ్లు కిక్కిరిసి పోయాయి. దీంతో పట్టణంలో పండుగ శోభసంతరించుకుంది.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ.. ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ

**మందమర్రి, ఆగస్టు 28 అక్షర కలం:**

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని సింగరేణి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఏరియా జిఎం కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులందరూ జిఎం రాధాకృష్ణకు రాఖీలు కట్టి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ, ముందుగా ఏరియాలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులందరికీ రాఖీ పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా ఉద్యోగులతో రాఖీ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. మహిళలు తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సోదర భావంతో ఏరియాలోని గనులు, విభాగాలలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగుల సంక్షేమానికి, భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ వేడుకతో కార్యాలయంలో సోదర భావం, ఆత్మీయత వెల్లివిరిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎం కార్యాలయ మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి ఆత్యా పాత్యా పోటీలకు జైపూర్ గురుకుల విద్యార్థుల ఎంపిక

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28:**

ఇటీవల మంచిర్యాలలోని ముల్కల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఆత్యా పాత్యా పోటీల్లో జిల్లాలోని జైపూర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కోల నాగేశ్వరరావు మాట్లాడుతూ, జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు బోర్లకుంట సాయి సహజ్, దేశెట్టి జస్వంత్, పాగే రాము, కొత్తపల్లి ప్రేమ్ సాగర్, జి అనుదీప్ లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆగస్టు 29, 30న నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు పిడి గాంధర్ల సంతోష్, పిఈటి రత్నం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, హౌస్ మాస్టర్లు అనిల్ కుమార్, ఎం శ్రీనివాస్, మధుకర్ లు అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలో సైతం మంచి ప్రతిభ కనబరిచి,




జాతీయ స్థాయి పోటీలకు సైతం ఎంపిక కావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధిస్తే స్పోర్ట్స్ కోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాఖీ వేడుకల్లో చిన్నారులతో ప్రధాని మోదీ సరదా ముచ్చట్లు

### దేశ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంతో ఉత్సాహంగా, సరదాగా గడిపారు. ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసం 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఈ ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రధానితో ముచ్చటిస్తూ.. చిన్నతనంలో మీరు ఎటువంటి కలలు కనేవారని ప్రశ్నించగా, మీ అందరినీ కలుసుకోవాలనే కన్నానంటూ ప్రధాని మోదీ చిరునవ్వుతో సరదాగా సమాధానమిచ్చారు. విద్యార్థులకు ఆప్యాయంగా షేక్ హ్యాండ్‌లు, హై-ఫైవ్‌లు ఇస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.చిన్నారులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన ప్రధాని, వారితో గడిపిన ఆనందకర క్షణాలకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. రక్షాబంధన్ అనేది ప్రేమ, ఆప్యాయత, పరస్పర నమ్మకాలకు ప్రతీక అని ప్రధాని పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సౌభాగ్యం మరియు విజయాలను నింపాలని ఆకాంక్షిస్తూ దేశ ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్ - మంచిర్యాల

# సమ్మె నోటీసు తో దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం

## పలు కీలక డిమాండ్ లపై అంగీకారం

**మందమర్రి, ఆగస్టు 28 అక్షర కలం:**

సింగరేణి కార్మికుల హక్కుల కోసం గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఇచ్చిన సమ్మె నోటీసు ప్రభావంతో దిగివచ్చిన సింగరేణి యాజమాన్యం 32 డిమాండ్లలో 23 కీలక డిమాండ్లకు అంగీకరించిందని, ఇది చరిత్ర తిరగరాసిన విజయమని యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాధుని సుదర్శన్ లు తెలిపారు. శుక్రవారం ఏరియాలోని కేకే 5 గని, ఏరియా వర్క్ షాప్ లో యూనియన్ ఆధ్వర్యంలో ద్వార సమావేశాలు నిర్వహించారు. అదే విధంగా ఏరియాలోని కాసీపేట 1 గనిలో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వార సమావేశానికి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హక్కుల సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఏఐటీయూసీ చేస్తున్న నిరంతర పోరాటంలో మరో కీలక విజయం సాధించిందని తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారం కొరకు జూన్ 8న యూనియన్ ఇచ్చిన సమ్మె నోటీసు పై యజమాన్యంతో పలుమార్లు ఆర్ఎల్సి సమక్షంలో చర్చలు నిర్వహించగా, ఆగస్టు 27న హైదరాబాద్ లో జరిగిన కీలక చర్చల్లో సింగరేణి యాజమాన్యం ప్రధాన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, పలు కీలక ఒప్పందాలకు అంగీకరించిందని తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ఏఐటీయూసీ కొనసాగించిన ఒత్తిడి, పోరాటం ఫలితంగానే యజమాన్యం దిగివచ్చి, కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుందన్నారు. ఈ చర్చల్లో కుదిరిన కీలక ఒప్పందాలలో ముఖ్యంగా కోలిండియా మాదిరి పెర్క్ పై ఐటి ని యాజమాన్యమే భరించేందుకు అంగీకరించిందని తెలిపారు. సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి 20 లక్షల రూపాయలు చెల్లించే చారిత్రాత్మక ఒప్పందం కుదిరిందన్నారు. కార్మికుల మెడికల్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను దసరా లోపు ప్రకటించేందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు తీసుకొనే చర్యలు చేపడుతామని యాజమాన్యం తెలిపిందన్నారు. బదిలీలలో 3 ఏళ్ల నిబంధనను తొలగించి, ఖాళీల ఆధారంగా ఒక సంవత్సరం నిబంధనతో బదిలీలు చేపట్టేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. సీనియర్ మైనింగ్ స్టాఫ్ లుగా పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు సకాలంలో ఓవర్ మెన్ పదోన్నతులు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. మారుపేర్ల సమస్యపై ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ కమిటీలో యూనియన్ ప్రతినిధులకు సైతం భాగస్వామ్యం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపిందన్నారు. సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హైదరాబాద్ లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేసే అంశంపై యాజమాన్యం అంగీకారం తెలిపిందన్నారు. దాదాపు 22 సంవత్సరాలుగా మార్పులేని మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సవరించేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. సర్వీస్ నుంచి దిగిపోయిన కార్మికులకు ఓపి సేవలతో పాటు వారం రోజులు చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. సింగరేణి పరిధిలోని విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో సిబిఎస్ఈ సిలబస్ అమలు చేసే అంశంపై యాజమాన్యం సానుకూల స్పందించిందన్నారు. గనులలో కార్మికుల భద్రతకు సంబంధించి అవసరమైన సేఫ్టీ మెటీరియల్ ను సకాలంలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు 9 శాతం హెచ్ఆర్ఏ చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. డిసిప్లినరి యాక్షన్ కింద సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్న డిస్మిస్ కేసులను పరిష్కరించేందుకు ఈ సమావేశంలో యాజమాన్యం తన అంగీకారాన్ని తెలిపిందన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్, అండర్ గ్రౌండ్, మైనింగ్ స్టాఫ్ లో జనరల్ అసిస్టెంట్ గా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా సర్ఫేస్ లో సూటబుల్ జాబు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఈఎస్ఐ వైద్య సదుపాయం అందేలా చర్యలు తీసుకుంటామని యాజమాన్యం అంగీకరించిందన్నారు. పెండింగ్లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాల కేసులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగరేణిలో పనిచేసిన ఉద్యోగులు సాంకేతిక విద్యను కొనసాగించేందుకు సాయంత్రం కళాశాలలో చదువుకోవడానికి అవసరమైన ఎన్ఓసి లు జారీ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న క్లరికల్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, పారామెడికల్, ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రికల్, మెకానికల్ సూపర్వైజర్లు, తదితర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకునేందుకు యజమాన్యం తన సమ్మతిని తెలియజేసిందన్నారు. ఈపీ ఫిట్టర్లు, క్లాంప్ ఫిట్టర్లు, సర్వేయర్లు తదితర కేడర్ స్కీమ్ లకు సంబంధించిన సమస్యలు పరిశీలించి, పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. మెడికల్ ఫిట్ అయినప్పటికీ పెండింగ్లో ఉన్న 149 డిపెండెంట్ లకు నెల రోజుల్లోపు ఆఫీస్ ఆర్డర్ లు జారీ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 250 గజాల స్థలం కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు. కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం, హక్కుల సాధనే ధ్యేయంగా ఏఐటియుసి పనిచేస్తుందన్నారు. కొన్ని కార్మిక సంఘాలు పనికట్టుకుని యూనియన్ సమ్మె నోటిస్ పై చర్చలతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించినప్పటికీ, నిన్న జరిగిన సమావేశంలో 32 డిమాండ్లకు గాను 23 డిమాండ్లను ఆర్ఎల్సి సమక్షంలో యాజమాన్యాన్ని ఒప్పించి, పరిష్కరించడం జరిగిందని తెలిపారు. పెర్క్ పై ఐటి తిరిగి చెల్లింపు సమస్యపై గత ప్రభుత్వ హయాంలో సర్కారు సంఘాలు విఫలమైనప్పటికీ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జట్టిలమైన ఈ సమస్యను పరిష్కరించడంలో ఏఐటీయూసీ పోరాటం ద్వారా కార్మికుల ఐక్యతతో సాధించుకోవడం జరిగిందన్నారు. సర్కారు సంఘాల కుటిల బుద్ధితో ఇంతకాలం కాలయాపన జరిగిందని, కార్మికుల పోరాటాలతో యాజమాన్యాలు, ప్రభుత్వాలు తలవంచక తప్పదని తెలిపారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు టపాకాయలు కాల్చి, సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పిట్ కార్యదర్శులు గాండ్ల సంపత్, సిహెచ్పి శర్మ, వడ్లమల్ల రాజేందర్, నాయకులు పెద్దపెల్లి బానయ్య, ఎగ్గేటి రాజేశ్వరరావు, రంజిత్ కుమార్ ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, సాధనవేన ప్రభాకర్, అశోక్ ఆడెపు, రవీందర్, హేమంత్ కుమార్, విక్రమ్ సింగ్, ప్రేమ్‌లాల్, వెంకటేష్, అనిల్, సతీష్, పార్వతి సురేష్, అటికేటి సందీప్ కుమార్, గణేష్ శంకర్ భాస్కర్, పిట్, సేఫ్టీ కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 28:**

ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూరు పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ఐఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్థవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ఎస్ఐఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

### సునాయాసంగా తరలిస్తున్న పేదల బియ్యం
### అధికారుల తీరులపై అనుమానాలు
### పిడి యాక్ట్ పెట్టినా జంకని రేషన్ అక్రమార్కులు
### లక్షల్లో దండుకుంటున్న వైనం
### సన్న బియ్యం అవడంతో మరింత గిరాకీ

**అక్షర కలం/ మహబూబాబాద్/ ఖమ్మం:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం సన్న బియ్యం అందిస్తూ పేదలకు అన్న బియ్యంతో కడుపు నింపాలని సదుద్దేశంతో అందిస్తుంటే ఇదే అదునుగా పలువురు రు రేషన్ అక్రమార్కులు అధికారుల కనుసన్నలతో సరిహద్దులను దాటిస్తున్నారు. పేదల కోసం రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం అందిస్తుంటే ఇదే అదునుగా సన్నబియ్యానికి మంచి గిరాకీ ఉండడంతో పలువురు అక్రమార్కులు ఇదే అదునుగా సరిహద్దులను దాటిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటా అని చెప్పినప్పటికీ రేషన్ అక్రమార్కులు మాత్రం ఎటువంటి భయం, భక్తి లేకుండా ఇష్టానుసారంగా పేదల బియ్యాన్ని రాష్ట్రాల సరిహద్దులు దాటిస్తూ దర్జాగా రూపాయలు లక్షలల్లో అక్రమ వ్యాపారంగా



కొనసాగిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం మూడు నెలల రేషన్ బియ్యం అందిస్తున్న నేపథ్యంలో రేషన్ అక్రమార్కులు మాత్రం అవలీలగా అధికారుల కనుసన్నలతోనే రాష్ట్రాల సరిహద్దులు దాటిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో కొందరు రేషన్ మాఫియా రాత్రి వేళలో రేషన్ బియ్యం మిల్లులకు తరలిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమాచారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం కాచినపల్లి నుంచి గుండాల ములుగు పసర ప్రాంతాల నుంచి ఏటూరు నాగారం బ్రిడ్జి నుంచి అవలీలగా చత్తీస్గడ్ రాష్ట్రానికి లారీల ద్వారా తరలిపోతున్నాయి. అధికారులకు ఆమ్యామ్యాలు అందుతున్నాయో లేదో అధికారుల కనుసన్నల్లతో నడుస్తున్నాయేమో అని పేద ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకంటే జరుగుతున్న గాని సంబంధిత అధికారులు స్తబ్దంగా ఉండడంతో పలు అనుమానాలు వెలువెత్తుతున్నాయి.

### - ఖమ్మం జిల్లాలో పలువురుపై పీడీ యాక్ట్ పెట్టినా ప్రయోజనం లేదని ఆరోపణలు

ఇటీవలే ఖమ్మం జిల్లాలో నలుగురిపై ఇదే రేషన్ అక్రమ సరఫరా గురించి పిడి యాక్ట్ పెట్టిన విషయం అందరికీ విధితమే. ఇది ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంతో రేషన్ బియ్యం రేషన్ అక్రమార్కుల నోటికి చేరి వారి కడుపుని కొల్లగొట్టే అవకాశాలు మెండుగా ఉంటాయి ఇది ఇలానే కొనసాగితే పేద ప్రజల కడుపు నింపేందుకు ప్రభుత్వం చేపడుతున్న సన్న బియ్యంతో రేషన్ బియ్యం లక్ష్యం నీరు గారే అవకాశం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి పేదల కడుపు కొట్టే రేషన్ అక్రమార్కుల దందాను నివారించాలని పేద ప్రజల కడుపు నింపాలని పేద ప్రజలు కోరుతున్నారు.

# నల్గొండ జిజిహెచ్ లో గర్భస్థ శిశువు మృతి

### -- కలెక్టర్ విచారణకు ఆదేశం
### -- నివేదిక సమర్పించిన ఆర్ఎంఓ!

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం సంభవించిన గర్భస్థ శిశు మరణం పై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పందించారు. గర్భస్థ శిశు మరణం సంఘటనపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు ఈ సంఘటనపై ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పించారు. ?తన నివేదికలో వివరాలను జిజిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ తెలియజేస్తూ ఎ. కీర్తి అనే 37 వారాల గర్భిణి కడుపునొప్పితో ఈనెల 27 న మధ్యాహ్నం 12:55 గంటల ప్రాంతంలో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి లో చేరిందని, ఆసుపత్రిలో చేరిన సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భస్థ శిశువు గుండెచప్పుడు సాధారణంగా ఉందని, 27 వ తేది మధ్యాహ్నం, రాత్రి అలాగే 28 ఉదయం వరకు నిరంతరం నిర్వహించిన వైద్య పరీక్షలలో కూడ గర్భస్థ శిశువు గుండెచప్పుడు సాధారణంగానే నమోదైందని, అలాగే రోగికి ( గర్భిణీ) కూడా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. అయితే 28 న ఉదయం 6:15 గంటలకు గర్భంలో కదలికలు తగ్గడంతో ఆమెను లేబర్ రూమ్‌కు తరలించడం జరిగిందని, ఆ సమయంలో వైద్య పరీక్షలు నిర్వహించగా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా గర్భస్థ శిశువు గుండెచప్పుడు వినబడలేదని,ఈ విషయాన్ని వెంటనే రోగి భర్తకు, బంధువులకు వివరించడంతోపాటు, వీడియో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. గతంలో సిజేరియన్ జరిగిన కేసు కావడం, శిశువు గర్భంలోనే మరణించడం వల్ల గర్భిణీకి ఇబ్బంది కలగకుండా కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమెకు అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. 28 న ఉదయం 07:15 గంటలకు శస్త్రచికిత్స ద్వారా మృత మగ శిశువును బయటకు తీయడం జరిగిందని,?శస్త్రచికిత్స సమయంలో ఆ తర్వాత కూడా రోగి (తల్లి) ఆరోగ్యం స్థిరంగా ఉందని పేర్కొన్నారు. అయితే గర్భస్థ శిశు మరణాన్ని ?ఊహించని, కారణం తెలియని గర్భస్థ శిశు మరణంగా నిర్ధారించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ తన నివేదికలో తెలిపారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా జిల్లా కలెక్టర్ కు మాత్రం నివేదిక ఇచ్చింది మాత్రం డ్యూటీ లో వున్నా అర్ఎంఓ. దానికి గల కారణం రెగ్యులర్ సూపరింటెండెంట్ సెలవులో ఉండటం, ఇన్చార్జి సూపరింటెండెంట్ లేకపోవడమే.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955